“ మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి.. “
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 12-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 344 Issue: 344

12 జూన్ 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:45 సూర్యాస్తమయం - సా. 6:46 తిథి ద్వాదశి రా. 7:31 వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం అశ్విని ఉ. 6:27 వరకు తరువాత కృతిక యోగం అతిగండ రా. 9:20 వరకు కరణం కౌలవ ఉ. 9:08 వరకు తైతుల రా. 7:31 వరకు వర్జ్యం మ. 3:06 నుండి సా. 4:32 వరకు దుర్ముహూర్తం ఉ. 8:21 నుండి ఉ. 9:13 వరకు మ. 12:41 నుండి మ. 1:34 వరకు రాహుకాలం ఉ. 10:38 నుండి మ. 12:16 వరకు యమగండం మ. 3:31 నుండి సా. 5:09 వరకు గుళికాకాలం ఉ. 7:22 నుండి ఉ. 9:00 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:09 నుండి తె. 4:57 వరకు అమృత ఘడియలు రా. 11:45 నుండి రా. 1:12 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:42 వరకు గమనిక: “o” అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

## ఇల్లాలికి నెలకు రూ.30,000

### దేశ నిర్మాణంలో గృహిణుల నిస్వార్థ సేవ.. వాళ్లు హోమ్ మేకర్స్ కాదు.. నేషన్ బిల్డర్స్.. సుప్రీం కోర్టు సంచలన తీర్పు



దేశంలోని కోట్లాది మంది గృహిణుల అపరిమితమైన శ్రమకు, కుటుంబ సంరక్షణకు అత్యున్నత న్యాయస్థానం చారిత్రాత్మక గుర్తింపునిచ్చింది. గృహిణులు చేసే ఉచిత గృహ సేవలు కేవలం ఇంటికే పరిమితం కాదని, అవి దేశ నిర్మాణంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

న్యూఢిల్లీ: ఇకపై మోటారు ప్రమాదాల్లో గృహిణులు మరణించినా లేదా శాశ్వత వైకల్యానికి గురైనా.. వారి కుటుంబాలు కోల్పోయే గృహ సంరక్షణ నష్టాన్ని ఒక ప్రత్యేక నష్టపరిహార కేటగిరీగా పరిగణించాలని ఆదేశించింది. ఈ సేవల కనీస విలువను నెలకు రూ. 30,000గా నిర్ధారిస్తూ సంచలన తీర్పును ఇచ్చింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కె. సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. 2001లో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో మరణించిన మహిళ కుటుంబానికి నష్ట పరిహారం పెంచాలంటూ దాఖలైన అప్పీలును విచారించిన కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. 2024లో పంజాబ్-హర్యానా హైకోర్టు సదరు మహిళ భర్త, ముగ్గురు పిల్లలకు కలిపి దాదాపు రూ. 8 లక్షల పరిహారాన్ని ఖరారు చేసింది. అయితే గృహిణుల సామాజిక, ఆర్థిక విలువను తక్కువగా అంచనా వేయడాన్ని సుప్రీం కోర్టు తప్పుబట్టింది. “ఇల్లాలు ప్రతి మనిషి ఎదుగుదలకు, తద్వారా దేశ పురోగతికి ఎనలేని సహకారం అందిస్తుంది. గృహిణి అంటే దేశాన్ని నిర్మించే శక్తి. అందుకే ఆమె అందించే గృహ సంరక్షణను నష్టపోతే, ఆ నెలవారీ కనీస ఆదాయ నష్టాన్ని ఏ పరిస్థితిలోనూ రూ. 30,000 కంటే తక్కువగా లెక్కించకూడదు” అని తీర్పు చదువుతూ జస్టిస్ సంజయ్ కరోల్ వ్యాఖ్యానించారు. సమాజంలో ‘హోమ్‌మేకర్’ అనే పదానికి బదులుగా ‘నేషన్ బిల్డర్’ అనే గౌరవప్రదమైన గుర్తింపు రావాలని ధర్మాసనం ఆకాంక్షించింది. గతంలో సుప్రీం తరువాయి 2 వ పేజీలో...




## ఫిఫా షురూ.. షకీరా హోరు!

మెక్సికో స్టేడియంలో రచ్చరంబోలా.. ఆటపాటలతో ఊపేసిన పాప్ సింగర్

(..పూర్తి వివరాలు క్రీడావాణి పేజీలో..)

## కవిత పార్టీపై 700 అభ్యంతరాలు

### ఈసీకి వెల్లువెత్తిన ఫిర్యాదులు

### టీఆర్ఎస్ మాదే: మహారాష్ట్ర నేత

టీఆర్ఎస్ పార్టీ పేరుకు సంబంధించి.. వివాదం రోజురోజుకూ ముదురుతోంది. ఇప్పటికే కవిత ప్రతిపాదించిన తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) పేరును కాస్తా కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రక్షణ సేనగా మార్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ టీఆర్ఎస్ పేరు మీద అభ్యంతరాలు చెప్పాలంటూ ఇచ్చిన ప్రకటనపై వందల కొద్ది అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.

న్యూఢిల్లీ: ఇక టీఆర్ఎస్ పేరును తామే ముందు రిజిస్టర్ చేసుకున్నట్లు మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి ఇప్పుడు ఈసీని ఆశ్రయించడం గమనార్హం. షార్ట్‌కట్‌లో టీఆర్ఎస్ పేరు వచ్చేలా తెలంగాణ రక్షణ సేన పేరుపై అభ్యంతరాలు ఉంటే చెప్పాలంటూ న్యూస్ పేపర్లలో ఇచ్చిన ప్రకటనపై దాదాపు 700 అభ్యంతరాలు అందినట్లు తెలుస్తోంది. అయితే తన పార్టీ పేరును కవిత అధికారికంగా ప్రకటించడానికి ఒకరోజు ముందే మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన దయానంద్ మహాదేవ్ మామ్‌డ్యాల్.. అనే వ్యక్తి.. తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన (టీఆర్ఎస్) అనే పార్టీ -2 వ పేజీలో...

## జర.. మా దిక్కు సూడుర్రి!

### మెట్రో-2, ఆర్ఆర్ఆర్‌కు నిధులియ్యాలె

### ప్రధాని మోదీతో భేటీలో రేవంత్ రెడ్డి

తెలంగాణ ప్రాజెక్టులకు నిధులు అందించాలని ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం ప్రధాని మోదీతో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన.. మెట్రో ఫేజ్-2, ఆర్ఆర్ఆర్, 12 లేన్ల ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ ప్రాజెక్టులు, కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు రావాల్సిన ఆర్థిక, ఇతర సహకారాలపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు.

న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రంలో రవాణా రంగంతోపాటు పారిశ్రామిక అభివృద్ధికి ఊతం ఇచ్చే రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) పనుల పురోగతిని ఈ సందర్భంగా ప్రధాని మోదీకి సీఎం రేవంత్ వివరించినట్లు తెలుస్తోంది. ఈ ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు.. కావాల్సిన కేంద్ర ప్రభుత్వ నిధులను వెంటనే రిలీజ్ చేయాలని కోరారు. దీంతో పాటు తెలంగాణ సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం డీప్ వాటర్ పోర్టు వరకు నిర్మించేందుకు ప్రతిపాదించిన తరువాయి 2 వ పేజీలో...





## 4,000 ఈవీఎంలు అగ్నికి ఆహుతి

### బెంగాల్ ప్రభుత్వ భవనంలో ప్రమాదం.. ప్రమాదమా? కుట్రా? కోణంలో విచారణ

24 పరగణాల: పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఓ అగ్ని ప్రమాదంలో ఇటీవల ఎన్నికల్లో ఉపయోగించిన 4 వేల ఈవీఎంలు కాలిబూడిదయ్యాయి. వాటిని భద్రపరిచిన ఓ ప్రభుత్వ భవనంలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించినట్టు బెంగాల్ మంత్రి కౌశిక్ చౌధురీ తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,564 |
| వెండి (కిలో): | రూ.2,60,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,106 |

## విశ్వవాణి



ఆఫ్రికాలోని మాలావి దేశంలో కచిందమోటో అనే ఆవిడ ఏకంగా 3,500 బాల్యవివాహాలను అడ్డుకున్నారు. వేల మంది బాలికలను పాఠశాల బాట పట్టేలా చేశారు. 2025లో ఆమె కన్నుమూసినా, బాలికల జీవితాల్లో, వారి భవిష్యత్తుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

## అమెరికా.. కాస్త తగ్గు!

### నేవీ దాడులు ఆపాల్సిందే.. హర్మూజ్‌లో ముగ్గురు భారతీయుల మృతి

### మృతుల్లో ఏపీకి చెందిన మెరైన్ ఇంజినీర్.. తీవ్రంగా స్పందించిన భారత ప్రభుత్వం



న్యూఢిల్లీ: అమెరికా- ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో హర్మూజ్ జలసంధిలో నౌకలపై జరుగుతున్న వరుస దాడులపై భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఇటీవల ఒమన్ తీరంలో పలావు జెండా కలిగిన ఎంటీ సెట్టిబెల్లో ట్యాంకర్‌పై జరిగిన దాడిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మెరైన్ ఇంజినీర్ సహా ముగ్గురు భారతీయులు మరణించారు. గడిచిన వారం రోజుల్లోనే భారతీయ సిబ్బంది ఉన్న నౌకలపై మూడుసార్లు దాడులు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో స్పందించిన భారత్.. అమెరికా నేవీ చర్యలపై తీవ్ర నిరసన తెలిపింది. కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియాతో మాట్లాడుతూ.. “గత కొద్ది రోజులుగా పశ్చిమాసియాలో భారతీయ తరువాయి 2 వ పేజీలో...



## ఖర్గ్‌ను ఆక్రమిస్తాం

### ఇరాన్‌ను గట్టిగా కొడతాం.. ట్రంప్ హెచ్చరికలు

ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం మళ్లీ ప్రారంభం కావడంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం రాత్రికి ఇరాన్‌పై చాలా గట్టిగా దాడిచేస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. వరుసగా మూడో రాత్రి కూడా తమ దాడులు కొనసాగుతాయని ఈ మేరకు తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు.

వాషింగ్టన్: “ఈ రాత్రి ఇరాన్‌పై అమెరికా చాలా తీవ్రంగా దాడి చేయబోతోంది (ఇరాన్ నౌకాదళం, వైమానిక దళం, రాడార్, విమాన నిరోధక వ్యవస్థలు, ఇతర అన్ని రకాల రక్షణ వ్యవస్థలతో పాటు దాని దాడి సామర్థ్యంలో అధిక భాగం కూడా నాశనమైపోయాయి!)” అని హెచ్చరికలు చేశారు. అంతేకాదు, ఇరాన్‌కు ఆర్థిక జీవనాడి, ఆ దేశ ముడి చమురు ఎగుమతుల్లో సుమారు 90 శాతాన్ని నిర్వహించే ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా ఏదో ఒక సమయంలో స్వాధీనం చేసుకుంటుందని కూడా ట్రంప్ అన్నారు. “మేము ఖర్గ్ ద్వీపాన్ని, ఇతర చమురు మౌలిక సదుపాయాల కేంద్రాలను స్వాధీనం చేసుకుంటాం.. ఇది ఎంతో దూరంలో లేదు.. వెనిజులా విషయంలో చేసినట్లే వారి చమురు, గ్యాస్ మార్కెట్లపై పూర్తి నియంత్రణను సాధిస్తాం... ఆ విధానం వెనిజులా, అమెరికా రెండింటికీ అద్భుతంగా పనిచేస్తోంది” అని ట్రంప్ అన్నారు.

## 20 ఏళ్లుగా జ్వరం రాలే!

### హైదరాబాద్ పాలు తాగగానే అంటుకుంది

### మూడ్రోజులు బెడ్ మీది నుంచి లేవలే

### కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడి

జమ్మికుంట/కరీంనగర్, జూన్ 11 (ఈవార్తలు): గత 20 ఏళ్లలో అమ్మవారి దయ వల్ల తనకు జ్వరమే రాలేదని.. కానీ హైదరాబాద్‌లో పాలు తాగిన వెంటనే జ్వరం వచ్చిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. జ్వరం రావడమే కాకుండా మూడ్రోజుల పాటు తాను ఆస్పత్రి బెడ్ మీదే ఉండాల్సి వచ్చిందని కూడా వివరించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ‘ప్రకృతి వ్యవసాయం - రైతు సమ్మేళనం’లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పై కామెంట్లు చేశారు. ‘గడిచిన 20 ఏళ్లలో నాకు ఎప్పుడూ చిన్న జ్వరం కూడా రాలేదు. నాకు తరువాయి 2 వ పేజీలో...



## ఏపీలో కాక్రోచ్‌లం మేమే

### చంద్రబాబుకు జగన్ వార్నింగ్



ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తి చూపిస్తుంటే.. తట్టుకోలేకపోతున్నారని సీఎం చంద్రబాబుపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చంద్రబాబు పాలనలో చాలాసార్లు పేపర్లు లీక్ అయ్యాయని గుర్తు చేశారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన సంఘటనలను జగన్ వివరించారు.

తాడేపల్లి, జూన్ 11 (ఈవార్తలు): ఈ క్రమంలోనే ప్రభుత్వ అసమర్థతపై తాము ప్రశ్నిస్తుంటే.. ప్రతీ ఒక్కరిపై కేసులు పెడుతున్నారని.. అరెస్ట్‌లు చేస్తున్నారని ఆరోపించారు. ఇలా ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తే.. కాక్రోచ్‌లు పుట్టుకొస్తాయని హెచ్చరికలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఏపీలో వైసీపీనే కాక్రోచ్‌లు అంటూ జగన్ వ్యాఖ్యానించారు. కూటమి సర్కార్ చేసిన తప్పులను తాము తరువాయి 2 వ పేజీలో...




## ఎల్లుండి హైదరాబాద్‌లో సీజేపీ నిరసన

### ఉదయం 10 గంటలకు ధర్నా చౌక్‌లో నిర్వహణ

### అదే రోజు సాయంత్రం బెంగళూరులోనూ!

హైదరాబాద్, జూన్ 11 (ఈవార్తలు): దక్షిణ భారతదేశంలో సీజేపీ తొలి నిరసన జూన్ 14న హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో చేపట్టనుంది. విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం, పరీక్షా విధానాలలో సంస్కరణలు కోరుతూ చేపట్టిన ‘గోయింగ్ నేషనల్’ ఉద్యమంలో ఈ ఆందోళనలు ఒక భాగమని సీజేపీ చెబుతోంది. సీజేపీ -2 వ పేజీలో...

## రాశి ఫలాలు

12.6.2026

మేషం: సోదరులతో వివాదాలు పరిష్కారమవుతాయి. ఉద్యోగులకు శుభవార్తలు అందుతాయి. నిరుద్యోగులకు అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. ఆస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

వృషభం: రావలసిన సొమ్ము సకాలంలో వసూలవుతాయి. చేపట్టిన పనులలో ఆటంకాలు ఉన్నప్పటికీ సకాలంలో పూర్తి చేస్తారు. ఆప్తుల నుండి ఆసక్తికర విషయాలు తెలుస్తాయి. సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. ప్రయాణాలు అనుకూలిస్తాయి.

మిధునం: దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో అదనపు పని భారం వలన తగిన విశ్రాంతి లభించదు. ఇంటా బయట చికాకులు పెరుగుతాయి. వ్యాపారాలు ఆశించిన రీతిలో రాణించవు. నిరుద్యోగులకు నిరాశ తప్పదు. విద్యార్థుల పోటీ పరీక్షల్లో మిశ్రమ ఫలితాలు అందుతాయి.

కర్కాటకం: చేపట్టిన పనులలో శ్రమాధిక్యత పెరుగుతుంది. వ్యాపార వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. కీలక వ్యవహారాలలో మాట పట్టింపులు ఉంటాయి. నిరుద్యోగుల ప్రయత్న లోపం వలన లభించిన అవకాశాలు చేజారుతాయి. ధన వ్యవహారాలలో కొంత అప్రమత్తంగా వ్యవహరించాలి.

సింహం: నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. మిత్రులతో చర్చలు ఫలిస్తాయి. వ్యాపారాలలో నష్టాలు భర్తీ అవుతాయి. గృహమున సంతాన శుభకార్యములు నిర్వహిస్తారు. అవసరానికి చేతికి డబ్బు అందుతుంది. ఉద్యోగాలలో సమస్యల నుండి బయటపడతారు.

కన్య: రావలసిన ధనం చేతికి అందుతుంది. కుటుంబ సమస్యలు పరిష్కార దిశగా సాగుతాయి. నూతన వస్తు వాహనం కొనుగోలు చేస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వృత్తి, ఉద్యోగాలలో ఉత్సాహకర వాతావరణం ఉంటుంది.

తుల: ఋణదాతల ఒత్తిడి నుండి బయటపడటానికి నూతన ఋణాలు చేస్తారు. జీవిత భాగస్వామితో ఆలయాలు సందర్శిస్తారు. చేపట్టిన పనుల్లో స్వల్ప అవరోధాలుంటాయి. కుటుంబ సభ్యులతో దూరప్రయాణాలు చేస్తారు. వ్యాపారాలలో ఆర్థిక నష్టాలుంటాయి. ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.

వృశ్చికం: నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహం కలిగిస్తాయి. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడులు పెరుగుతాయి. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున అప్పగించిన బాధ్యతలు నిర్వహించడంలో విఫలమౌతారు. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఆస్తి వ్యవహారాలలో వివాదాలు కలుగుతాయి.

ధనస్సు: సంఘంలో ప్రముఖుల నుండి విశేషమైన సహకారం లభిస్తుంది. వివాదాలకు సంబంధించి కీలక సమాచారం అందుతుంది. వ్యాపారస్తులకు నూతన పెట్టుబడులు అందుతాయి. మిత్రుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో తెలివిగా సమస్యల నుండి బయటపడతారు.

మకరం: వ్యాపారాలు మరింత మందగిస్తాయి. ఉద్యోగులకు సహోద్యోగులతో మనస్పర్థలు కలుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబ వాతావరణం చికాకు కలిగిస్తుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి. ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. నూతన ఋణ ప్రయత్నాలు కలసిరావు.

కుంభం: ఇంటా బయట కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. వృత్తి వ్యాపారమున వ్యవహార అనుకూలత కలుగుతుంది. కొన్ని సంఘటనలు గుర్తు చేసుకుని బాధపడతారు. ఉద్యోగస్థులకు నూతన అవకాశములు లభిస్తాయి. ఉద్యోగమున అనుకూల మార్పులు ఉంటాయి. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

మీనం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. సన్నిహితుల నుండి వివాద విషయమై కీలక సమాచారం అందుతుంది. ఉద్యోగాలలో శ్రమకు తగిన ఫలితం ఉండదు. చేపట్టిన పనులు నిదానంగా పూర్తవుతాయి. కొన్ని విషయాలలో తొందరపడి నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. సంతాన శుభకార్యల విషయమై ప్రస్తావన వస్తుంది.

# జర.. మా దిక్కు సూడుర్రి!

మొదటి పేజీ తరువాయి

అత్యంత కీలకమైన 12 లేన్ల ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నగరవాసుల ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు సిద్ధం చేసిన హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్–2 పనులకు కేంద్ర ప్రభుత్వ వాటాను.. అందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని ఈ సందర్భంగా ప్రధానిని రేవంత్ రెడ్డి కోరారు. అదే సమయంలో హైదరాబాద్ నగర రూపురేఖలను మార్చేలా.. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా తమ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది ప్రక్షాళన కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ ఆర్థిక, టెక్నికల్ సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో దక్షిణ తెలంగాణకు వరప్రదాయిని అయిన జైపాల్ రెడ్డి పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి (పీఆర్ఎస్ఐఎస్) సంబంధించి కేంద్ర జల సంఘం నుంచి త్వరగా ఆమోదం ఇప్పించాలని ఈ భేటీలో ప్రధాని మోదీని రేవంత్ రెడ్డి కోరినట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీతో భేటీ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి.. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో కూడా సమావేశం అయ్యారు. పట్టణ అభివృద్ధి శాఖకు సంబంధించిన విషయాలపై కేంద్రమంత్రితో చర్చించారు.

హైదరాబాద్‌కు రూ.లక్ష కోట్లివ్వాలి

దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజిన్లుగా మెట్రో నగరాలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహించాలని గతంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించగా.. తాజాగా ఆ ప్రతిపాదనలను.. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం ముందు ఉంచారు. దేశంలోని ప్రధాన మెట్రో నగరాలైన ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల అభివృద్ధి కోసం.. ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో 'ఎం–6 టాస్క్‌ఫోర్స్'ను ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరుతూ ఈ సమావేశంలో పలు ప్రతిపాదనలు చేశారు. ఈ 6 మెట్రో నగరాల అభివృద్ధి కోసం రూ. 6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ 6 నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కోసం ఒక్కో నగరానికి రూ.1 లక్ష కోట్ల చొప్పున నిధులు అందించాలని కోరారు. దేశ అభివృద్ధి, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను సాధించడంపై ఈ సందర్భంగా తన అభిప్రాయాలను సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తం చేశారు. కుల గణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను ఈ సమావేశంలో వివరించారు. తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ మెట్రో 2వ దశ విస్తరణ, మూసీ నది పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు మద్దతు, హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు వంటి అంశాల్లో సహకారం అందించాలని కోరారు. దేశం అభివద్ధి చెందేందుకు విద్య, వైద్యం బలమైన పునాదిగా నిలుస్తాయని రేవంత్ రెడ్డి అభివర్ణించారు.

విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించాలన్నా.. దేశంలోని ప్రతీ విద్యార్థికి, పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. దేశాభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధి అని.. ప్రజలను ఆర్థిక శక్తులుగా, దేశ నిర్మాతలుగా తీర్చిదిద్దడంలో విద్య, ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. 2024లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 3.55 కోట్ల మంది, 242 కులాలకు చెందిన ప్రజల వివరాలను సేకరించిన ఈ సర్వేలో ఆర్థిక స్థితిగతులు, భూమి కంటే విద్య.. సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తున్న ముఖ్యమైన అంశంగా వెల్లడైందన్నారు. అందుకే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య అందించడం ద్వారా మాత్రమే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని చెప్పారు. ఈ ప్రాధాన్యత నేపథ్యంలోనే విద్యా శాఖను స్వయంగా తానే నిర్వహిస్తున్న విషయాన్ని, విద్యా రంగంలో తీసుకురావలసిన సంస్కరణలను ప్రస్తావించారు. గడిచిన 75 ఏళ్లలో ఉచిత విద్య అందించేందుకు ప్రయత్నించారని.. కానీ నాణ్యమైన విద్యను అందించడం ఒక సవాలుగా మారిందని రేవంత్ రెడ్డి తెలిపారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతులు, ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, పాఠశాల బస్సులు, క్రీడా సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందిస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో చదివే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. తెలంగాణలో నిర్మించే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు కులాల మధ్య గోడలు కూల్చివేస్తాయని విశ్వాసం సీఎం రేవంత్ వ్యక్తం చేశారు. సమాజంలో సమానత్వం పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఈ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకోవడం, కలిసి జీవించడం ద్వారా కుల వివక్ష తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. దేశంలో ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి అయినా, అధికారులైనా తెలంగాణలోని యంగ్ ఇండియా స్కూల్స్ సందర్శిస్తే సంతోషిస్తామని చెప్పారు. ఏఐ యుగంలో యువతకు కొత్త నైపుణ్యాలు అవసరమని.. తయారీ రంగం, సేవారంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైల్వే, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు విషయాన్ని ప్రస్తావిస్తూ.. ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆనంద్ మహీంద్రా, శ్రీనిరాజు వంటి కార్పొరేట్ దిగ్గజాలు యూనివర్సిటీ నిర్వహణలో భాగస్వాములుగా ఉన్నారని తెలిపారు. టాటా టెక్నాలజీస్ సహకారంతో రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా మార్చేందుకు భాగస్వామ్యం కుదుర్చుకున్నామని వెల్లడించారు. టాటా సంస్థ రూ.2,100 కోట్ల పెట్టుబడి పెడుతుందని అన్నారు.

# 20 ఏళ్లుగా జ్వరం రాలే!

మొదటి పేజీ తరువాయి

ఎలాంటి బీపీ, షుగర్ లాంటి ఆరోగ్య సమస్యలు లేవు. దేశం కోసం నిరంతరం శ్రమించే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీయే నా ఫిట్‌నెస్‌కు స్ఫూర్తి. ఆ అమ్మవారి దయ వల్ల ఇన్నాళ్లూ ఆరోగ్యంగా ఉన్నాను. కానీ ఈ మధ్య కాలంలో హైదరాబాద్‌లో పాలు తాగి నేను ఏకంగా మూడు రోజుల పాటు ఆసుపత్రి పాలయ్యాను. ప్రస్తుతం మనం నివసిస్తున్న భూమి అంతా కెమికల్స్‌తో నిండిపోయింది. మార్కెట్లో దొరికే మామిడి కాయలను తినాలన్నా ప్రజలు భయపడే పరిస్థితి వచ్చింది. సమాజంలో వస్తున్న రోగాలకు కారకులం మనమే. వాటిని నివారించగలిగేది కూడా మనమే' అని ఆవేదన వ్యక్తం చేశారు. రసాయన ఎరువుల వాడకం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతున్న భారాన్ని బండి సంజయ్ గణాంకాలతో సహా వివరించారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో దాదాపు రూ. 2 లక్షల కోట్లను కేవలం యూరియా సబ్సిడీల కోసమే ఖర్చు చేస్తోందని గుర్తు చేశారు. అందులో రూ. 1.20 లక్షల కోట్ల భారీ సొమ్మును విదేశాలకు పంపి యూరియాను దిగుమతి చేసుకోవడం ఎంతో బాధాకరమన్నారు. మన దేశ సొమ్ము విదేశాలకు వెళ్లకుండా అడ్డుకట్ట వేసేందుకే మోదీ ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా' ద్వారా స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. రైతులు సంప్రదాయ రసాయన సాగును వీడి ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. "ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేకంగా రూ. 2,400 కోట్లు కేటాయించింది. ఈ సాగు విధానం మొదలు పెట్టిన తొలి రెండు, మూడేళ్లు ఆశించిన స్థాయిలో లాభాలు రాకపోయినా.. ఆ తర్వాత భూమి సారవంతమై రైతులు ఖచ్చితంగా కోటీశ్వరులు అవుతారు" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం మార్కెట్లో ఆర్గానిక్ ఉత్పత్తులకు విపరీతమైన డిమాండ్ ఉందని, ప్రజలు ఎంత ధరైనా పెట్టి కొనడానికి ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. రాబోయే రెండేళ్ల కాలంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కనీసం 25 వేల మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేలా తాము ప్రత్యేక చర్యలు తీసుకోబోతున్నట్లు బండి సంజయ్ ప్రకటించారు. ఈ విధానంలో పండించిన పంటలకు ప్రభుత్వం తరఫున మంచి మద్దతు ధర లభించేలా చూస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

## ఏపీలో కాక్రోచ్‌లం మేమే

మొదటి పేజీ తరువాయి

ప్రశ్నిస్తుంటే.. చంద్రబాబుకు నరాలు తెగిపోయే అంత బీపీ వస్తోందని వైఎస్ జగన్ ఎద్దేవా చేశారు. అందుకే ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి, వారిని అరెస్టులు చేసి భయపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ఒకటి గుర్తుపెట్టుకోవాలని.. ఇది జెన్‌జీ కాలమని.. ఇప్పుడు జెన్ ఆల్ఫా కూడా నడుస్తోందని పేర్కొన్న వైఎస్ జగన్.. దేన్నీ ఆపలేరని గుర్తు చేశారు. మీరు ఆపాలని ప్రయత్నిస్తే.. ఇంతింతై వటుడింతై పెరుగుతుందని హెచ్చరించారు. దగాపడిన యువత కూటమి ప్రభుత్వాన్ని విడిచిపెట్టదని, తగిన గుణపాఠం తప్పకుండా చెప్తారని తేల్చి చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా కాక్రోచ్‌లు బయటికి వస్తాయి జాగ్రత్త అంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇక చంద్రబాబు పాలన మొత్తం లీకుల మయమేనని వైఎస్ జగన్ ఆరోపించారు. ప్రస్తుతం డీఎస్సీ విషయంలోనూ అదే జరిగిందని పేర్కొన్నారు. 1995లో టెన్త్ క్లాస్ పేపర్ల లీక్.. 1996లో ఎంసెట్ ఇంజినీరింగ్ పేపర్స్ లీక్.. 1997లో ఇంటర్మీడియట్ పేపర్స్ లీక్.. 2017 టెన్త్ సైన్స్ పేపర్ లీక్.. 2019లో టెన్త్ పేపర్ లీక్.. 2025లో బీఈడీ పేపర్ లీక్.. 2025లో టెన్త్ మ్యాథ్స్ పేపర్ లీక్.. ఇప్పుడు డీఎస్సీ టీచర్ల రిక్రూట్‌మెంట్ పేపర్ లీక్ అంటూ ఎద్దేవా చేశారు. పేపర్ లీకుల్లో ఇది చంద్రబాబు రికార్డు అంటూ వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

## కవిత పార్టీపై 700 అభ్యంతరాలు

మొదటి పేజీ తరువాయి

పేరు కోసం కేంద్ర ఎన్నికల సంఘంను ఆశ్రయించినట్లు సమాచారం. అయితే కవిత తెలంగాణ రక్షణ సేన.. దయానంద్ దరఖాస్తు చేసిన తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన పార్టీలకు షార్ట్ కట్ టీఆర్ఎస్ ఒక్కటే కావడంతో ఈ వివాదం నెలకొంది. ఏప్రిల్ 25వ తేదీన పార్టీ ఆవిర్భావ కార్యక్రమం సందర్భంగా తన పార్టీ పేరు టీఆర్ఎస్ అని ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) అంటూ ప్రకటించారు. ఆ తర్వాత కొన్నిరోజులకే ఎన్నికల సంఘం తెలంగాణ రక్షణ సేన పేరుకు ఆమోదం కల్పించింది. పార్టీ పేరు మారినా.. దానికి షార్ట్‌కట్ టీఆర్ఎస్ రావడంతో కవిత సంతోషంలోనే ఉన్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు టీఆర్ఎస్ పార్టీ పేరుపై మరోసారి అభ్యంతరాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో కవిత కొత్త పార్టీకి టీఆర్ఎస్ అనే పేరు కొనసాగుతుందా లేదా అనేది సర్వత్రా ఉత్కంఠగా మారింది. మరోవైపు.. కవిత పార్టీకి టీఆర్ఎస్ పేరు పెట్టడంపై భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) హైకమాండ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘానికి అధికారికంగా ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. 14 ఏళ్ల పాటు సుదీర్ఘంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన ఉద్యమంలో టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి) అనే పేరు తెలంగాణ ప్రజల ఎమోషన్స్‌తో అల్లుకుపోయిందని బీఆర్ఎస్ తెలిపింది. ఇప్పటికీ గ్రామాల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌నే గుర్తిస్తున్నారని.. ఇప్పుడు అదే పేరుతో ఇంకో కొత్త పార్టీకి ఆమోదం ఇస్తే, ప్రజలు తీవ్ర గందరగోళానికి గురయ్యే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ లీగల్ సెల్ వాదించింది.

## ఎల్లుండి హైదరాబాద్‌లో సీజేపీ నిరసన

మొదటి పేజీ తరువాయి

విడుదల చేసిన అధికారిక షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్‌లో నిరసన జూన్ 14న ఉదయం 10 గంటలకు ధర్నా చౌక్‌లో జరగనుంది. విద్యార్థి సంఘాలు, పౌర సమాజ సభ్యులు ఇందులో పాల్గొంటారని అంచనాతో శాంతియుత ప్రదర్శనకు పిలుపునిచ్చారు. అదే రోజున సాయంత్రం బెంగళూరులోని ఫ్రీడమ్ పార్కులో భారీ నిరసన జరుగుతుందని తెలిపింది. దక్షిణాదిన విస్తరణలో భాగంగా ఈ రెండు నిరసనలు చేపట్టినట్టు సీజేపీ పేర్కొంది. జూన్ 11న మహారాష్ట్రలోని పుణేలో నిరసన చేపట్టింది. జూన్ 12న ఉత్తర్ ప్రదేశ్ లక్నో (ఇకో గార్డెన్)లో, పంజాబ్‌లో జూన్ 13న అమృత్‌సర్‌లో, జూన్ 14 హైదరాబాద్, బెంగళూరు, జూన్ 15న రాజస్థాన్ రాజధాని జైపూర్, జూన్ 20 ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు నిర్వహిస్తామని వెల్లడించింది. ప్రశ్నపత్రాల లీకేజీ, ఫలితాల జాప్యం, నియామకాలు, ప్రవేశ పరీక్షలలో పారదర్శకత లోపించడం వంటి సమస్యలను పరిష్కరించడమే ఈ నిరసనల లక్ష్యమని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. ఈ వ్యవస్థ దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తోందని, అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించడం లేదని ఆయన ఆరోపించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరగనున్న నిరసన ఈ ఉద్యమంలో చివరి, అత్యంత ముఖ్యమైన ఘట్టంగా భావిస్తున్నారు. విద్యా రంగంలోని వ్యవస్థాగత వైఫల్యాలకు బాధ్యుడిగా భావిస్తున్న విద్యాశాఖ మంత్రి రాజీనామాతో సహా తమ డిమాండ్లు నెరవేరే వరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని దీప్కే పేర్కొన్నారు.

## ఇల్లాలికి నెలకు 30,000

మొదటి పేజీ తరువాయి

కోర్టు ఇచ్చిన ల్యాండ్‌మార్క్ 'ప్రణయ్ సేథి' తీర్పులో నిర్దేశించిన నష్టపరిహార ప్రాతిపదికలన్నింటికీ.. ఈ 'గృహ సంరక్షణ నష్టం' అనేది అదనపు గ్రౌండ్‌గా జతకూడుతుందని బెంచ్ స్పష్టం చేసింది. గృహిణులు ఎలాంటి పనీ చేయడం లేదనే భావన పూర్తిగా తప్పని, కనీసం రోజువారీ కూలీలకు ప్రభుత్వాలు ప్రకటించే కనీస వేతనాల కంటే వారి సేవలు ఏమాత్రం తక్కువ కాదని కోర్టు పునరుద్ఘాటించింది. కేవలం పరిహార సూత్రాలను ఖరారు చేయడమే కాకుండా, దేశవ్యాప్తంగా ఉన్న మోటారు ప్రమాదాల క్లెయిమ్ ట్రిబ్యునళ్లలో కేసుల విచారణను వేగవంతం చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 169 ప్రకారం.. ఈ తరహా కేసులను క్లుప్తమైన ప్రక్రియ ద్వారా చాలా వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించాల్సి ఉందని గుర్తు చేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాల హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు ఈ కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, చట్ట నిబంధనలను అక్షరాలా అమలు చేసేలా చూడాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

## అమెరికా.. కాస్త తగ్గు!

మొదటి పేజీ తరువాయి

నావికులకు సంబంధించి అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి.. మేము మా నావికుల సంక్షేమానికి, శ్రేయస్సుకు అత్యంత ప్రాధాన్యమిస్తాం.. ఈ విషయాన్ని మళ్లీ నొక్కి చెప్పనవసరం లేదు. ఒమన్ తీరంలో ఒక నౌకపై జరిగిన దాడిని మేము ఖండించాం.. ఆ దాడిలో దురదృష్టవశాత్తు ముగ్గురు భారతీయ పౌరులను కోల్పోయాం" అని అన్నారు. 'తీవ్ర నిరసనను తెలియజేయడానికి అమెరికా కాన్సులేట్ అధికారిని ఇక్కడికి పిలిపించాం. ఈ ప్రాంతంలో నౌకలపై నిరంతరం జరుగుతున్న దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణకు ప్రత్యక్ష ఫలితం. ఈ దాడులు తప్పక ఆగిపోవాలి. త్వరగా శాంతి, స్థిరత్వాన్ని తిరిగి తీసుకురావడానికి చర్చలు, దౌత్యం జరపాలని కూడా పిలుపునిస్తున్నాం' అని పేర్కొన్నారు. ఇక, వాణిజ్య నౌకలపై దాడులు ఆగిపోవాలని, అలాగే అంతర్జాతీయ జలాల్లో ప్రయాణించే నావికుల భద్రత, రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని సమావేశంలో అధికారులు నొక్కిచెప్పినట్లు సమాచారం. ఈ దాడి తర్వాత 24 మంది భారతీయ సిబ్బందిలో 21 మందిని రక్షించగా, మొదట ఆచూకీ లభించని మరో ముగ్గురిని తర్వాత మరణించినట్లు నిర్ధారించారు. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హర్మూజ్ జలసంధి, దాని పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ఘటన జరిగింది. అమెరికా తాజా దాడులతో హర్మూజ్ జల సంధిని ఇరాన్ పూర్తిగా మూసివేసింది. అన్నిరకాల నౌకలకు ఈ జల సంధిని మూసివేసినట్లు ప్రకటించింది. రెండు ట్యాంకర్లపై కూడా ఇరాన్ దళాలు దాడులు చేశాయి.

## 4,000 ఈవీఎంలు అగ్నికి ఆహుతి

మొదటి పేజీ తరువాయి

వెల్లడించారు. కోల్‌కతాలోని అలీపుర్ ప్రాంతంలో ఉన్న 9 అంతస్తుల భవనంలో ప్రభుత్వ విభాగాలతోపాటు సౌత్ 24 పరగణాల జిల్లా పరిషత్ ఆఫీసు కూడా ఉంది. 24 గంటల పాటు శ్రమించి అతికష్టమ్మీద మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్టు సమాచారం. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన మంత్రి కౌశిక్ మీడియాతో మాట్లాడుతూ.. "ఈ ఘటనలో దాదాపు 4,000 ఈవీఎంలు దగ్ధమయ్యాయి.. ఇటీవలి జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో 10 నియోజకవర్గాల్లో ఈ ఈవీఎంలను వినియోగించారు.. ఇది సాధారణ ప్రమాదంలా కనిపించడం లేదని, ఏదైనా కుట్ర ఉందా? అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నాం.. రెండు, మూడు అంతస్తుల్లో మొదలైన మంటలు మధ్యలో ఉన్నవాటికి అంటుకోలేదు.. కానీ, ఎనిమిది, తొమ్మిదో అంతస్తులకు వ్యాపించడంపై అనుమానం ఉంది.. వాటికి మంటలు ఎలా వ్యాపించాయో స్పష్టంగా తెలియరాలేదు. పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోంది.. ఫోరెన్సిక్ నివేదిక తర్వాత ప్రమాదంపై స్పష్టత వస్తుంది" అని చెప్పారు. దక్షిణ 24 పరగణాల జిల్లా కలెక్టర్ ఫిర్యాదుతో అలీపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఈ అగ్ని ప్రమాదం వెనుక కుట్రకోణాన్ని కొట్టిపారేయలేమని కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ వ్యాఖ్యానించారు. ఇది పక్కా ప్లాన్‌తో జరిగిందని బీజేపీ నాయకుడు రాకేష్ సింగ్ ఆరోపించారు. ఈ ఆరోపణలను బలపరిచే ఎలాంటి ఆధారాలు ఇప్పటివరకు బయటపడలేదు. ఫోరెన్సిక్, శాస్త్రీయ ఆధారాలతోనే దీనిపై నిర్ధారణకు వస్తామని దర్యాప్తు బృందాలు పేర్కొన్నాయి. భవనంలో ఉన్న ప్రభుత్వ రికార్డులు, భద్రతా వ్యవస్థలు, మౌలిక సదుపాయాలకు వాటిల్లిన నష్టాన్ని కూడా అధికారులు అంచనా వేస్తున్నారు. అగ్నిప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ లేదా మరేదైనా ఇతర కారణమా? దర్యాప్తు అధికారులు పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు ఎలాంటి నిర్దిష్ట కారణం తేలలేదని అధికారులు తెలిపారు. పలు అంతస్తులకు మంటలు ఏ రీతిలో వ్యాపించాయనే దానిపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. భవనాన్ని సీల్ చేసి, దాని చుట్టూ పోలీసులు నిఘాను పెంచారు. ఫోరెన్సిక్ నిపుణులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నమూనాలను సేకరించే అవకాశం ఉంది. ఈ అగ్నిప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఏదైనా ఉద్దేశపూర్వక చర్య ఫలితమా? అని నిర్ధారించడంలో ఫోరెన్సిక్ నివేదికలు కీలకమని అధికారులు తెలిపారు.

# ఇంధన భద్రతకు బొగ్గు గ్యాసిఫికేషన్

**ఆత్మనిర్భర్ భారత్‌కు కొత్త ఊపు**


**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**



హైదరాబాద్, జూన్ 11 (ఈవార్తలు): దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంతో పాటు దిగుమతులపై ఆధారాన్ని తగ్గించే దిశగా బొగ్గు గ్యాసిఫికేషన్ కీలక పాత్ర పోషించనుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. బొగ్గు మరియు లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో పరిశ్రమల ప్రముఖులు, సాంకేతిక సంస్థలు, పెట్టుబడిదారులు, ఆర్థిక సంస్థలు, బొగ్గు, లిగ్నైట్ కంపెనీలు, పరిశ్రమల సంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేశంలో బొగ్గు గ్యాసిఫికేషన్‌కు ఊతమివ్వడం, సమృద్ధిగా లభ్యమయ్యే బొగ్గు వనరులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం, పరిశుభ్రమైన వినియోగాన్ని ప్రోత్సహించడం ఈ రోడ్‌షో ప్రధాన ఉద్దేశ్యంగా నిలిచింది. కేంద్ర సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే, బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, అదనపు కార్యదర్శి సనోజ్ కుమార్ ఝూతో పాటు పలువురు సీనియర్ అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కిషన్ రెడ్డి, భారతదేశం దాదాపు 400 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు కలిగి ఉందని, ఇది ప్రపంచంలో ఐదవ అతిపెద్ద నిల్వ అని తెలిపారు. ప్రస్తుతం భారత్ ప్రపంచంలో రెండవ అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారు, వినియోగదారుగా ఉన్నదని పేర్కొన్నారు. దేశ విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 70 శాతం బొగ్గుపైనే ఆధారపడుతుండగా, లక్షలాది మంది జీవనోపాధి ఈ రంగంతో ముడిపడి ఉందన్నారు. భారత్‌కు విస్తారమైన బొగ్గు నిల్వలు ఉన్నప్పటికీ మెథనాల్, అమ్మోనియా, ఎరువుల ముడి పదార్థాలు, ఇతర కీలక పారిశ్రామిక రసాయనాల దిగుమతులపై ఇంకా అధికంగా ఆధారపడుతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశీయ బొగ్గును విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం ద్వారా విదేశీ మారకద్రవ్య వ్యయాన్ని తగ్గించడంతో పాటు ఇంధన భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని వివరించారు.

**రూ.46 వేల కోట్ల ప్రోత్సాహక పథకం**

ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల కోసం కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన రూ.46,000 కోట్ల సంయుక్త ప్రోత్సాహక పథకం దేశ ఇంధన, పారిశ్రామిక రంగ చరిత్రలో కీలక మైలురాయిగా నిలుస్తుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పథకం దేశవ్యాప్తంగా భారీ స్థాయి గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు కొత్త ఊపునిస్తుందని చెప్పారు. పెట్టుబడిదారులు, సాంకేతిక సంస్థలకు అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పారదర్శకత, జవాబుదారీతనం, పరిశ్రమలకు అనుకూల విధానాలు ఈ కార్యక్రమ విజయానికి కీలకమని స్పష్టం చేశారు. డ్రాఫ్ట్ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ)ను ఇప్పటికే ప్రజా డొమైన్‌లో ఉంచినట్లు తెలిపారు. పరిశ్రమల ప్రతినిధులు తమ విలువైన సూచనలు అందించాలని ఆయన కోరారు. బొగ్గు గ్యాసిఫికేషన్ రంగంలో ప్రపంచంలోనే అత్యంత ఆశాజనక పెట్టుబడి గమ్యస్థానాలలో భారత్ ఒకటిగా అవతరించేందుకు సిద్ధంగా ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. "మనకు సమృద్ధిగా బొగ్గు ఉంది.. విధానపరమైన మద్దతు ఉంది.. ప్రభుత్వ నిబద్ధత ఉంది. బొగ్గు గ్యాసిఫికేషన్ భారత పారిశ్రామిక వృద్ధికి, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి కొత్త చోదకశక్తిగా మారుతుంది" అని ఆయన అన్నారు. రోడ్‌షోలో పెట్టుబడి అవకాశాలు, సాంకేతిక పురోగతి, అమలు వ్యూహాలు, విధానపరమైన మద్దతు తదితర అంశాలపై విస్తృత చర్చలు జరిగాయి.



## ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

హైదరాబాద్, జూన్ 11 (ఈవార్తలు): తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ముఖ్యమైన అప్‌డేట్. తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల 2026 ఫలితాలను విడుదల చేసింది. మే 13 నుంచి మే 21 వరకు జరిగిన ఈ పరీక్షలకు హాజరైన ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులు తమ ఫలితాలను ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. ప్రధాన పరీక్షల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సబ్జెక్టులలో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థుల కోసం బోర్డు ఈ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించింది. జనరల్, ఒకేషనల్ విభాగాలకు చెందిన మొదటి, రెండో సంవత్సరం ఫలితాలను ఒకేసారి అందుబాటులో ఉంచారు. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్‌ను ఉపయోగించి మార్కుల మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## ఇక పర్మినెంట్ ఆఫీసులు!

**రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు**

**మంత్రి పొంగులేటి వెల్లడి**

**తొలి దశలో 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలు**

హైదరాబాద్, జూన్ 11 (ఈవార్తలు): రాష్ట్రంలోని అన్ని ఆర్డీవో, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలను నిర్మించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. గురువారం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు గౌరవప్రదమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తొలి దశలో భాగంగా 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఒకే నమూనాలో కొత్త భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అద్దె ఇళ్లలో, శిథిలావస్థలో ఉన్న కార్యాలయాల సమస్యకు దీని ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు తుది డిజైన్లను ఖరారు చేస్తామని తెలిపారు. భవన నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, ఓఆర్ఆర్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి ఆధునిక సమీకృత భవనాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్, పటాన్‌చెరు, కోహెడలలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. గత ప్రభుత్వం ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేసిందని విమర్శించిన మంత్రి, తాము కొత్త మండలాలకు అవసరమైన పోస్టులను భర్తీ చేసి పరిపాలనను బలోపేతం చేశామని వివరించారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## రూ.5000 కోట్ల స్కాంకు చెక్!

**'ఇగ్నైట్' పేరుతో క్యూనెట్ నిర్వాహకుల స్కాం**

**హైదరాబాద్ పోలీసుల భారీ ఆపరేషన్**

హైదరాబాద్, జూన్ 11 (ఈవార్తలు): హైదరాబాద్ పోలీసులు సుమారు రూ. 5,000 కోట్ల భారీ ఆర్థిక మోసాన్ని సకాలంలో గుర్తించి అడ్డుకున్నారు. 'ఇగ్నైట్' పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్న మనీ సర్క్యులేషన్ నెట్‌వర్క్‌ను ఛేదించి, నలుగురు కీలక నిందితులను అరెస్టు చేశారు. అమాయక ప్రజల నుంచి భారీగా నగదు వసూలు చేసేందుకు సిద్ధమైన ఈ ముఠా కుట్రను సీసీఎస్ పోలీసులు ముందే పసిగట్టారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ మీడియాకు వెల్లడించారు. ఈ వ్యవహారంలో హైదరాబాద్ పోలీసులు 'ఆపరేషన్ ఇగ్నైట్ క్రాక్‌డౌన్' పేరిట ప్రత్యేక చర్యలు చేపట్టారు. కేరళ, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. సదరు సంస్థ భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన కేవలం 18 రోజుల్లోనే పోలీసులు రంగంలోకి దిగి, పెను నష్టం జరగకుండా నివారించడం విశేషం. గతంలో నిషేధానికి గురైన క్యూనెట్, విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ నెట్‌వర్క్‌ల నిర్వాహకులే 'ఇగ్నైట్' పేరిట ఈ సరికొత్త మోసానికి తెరలేపినట్లు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) దర్యాప్తులో వెల్లడైంది. గత మూడు దశాబ్దాలుగా ఈ ముఠా వరుసగా గోల్డ్ క్వెస్ట్, క్వెస్ట్‌నెట్, క్యూనెట్, తాజాగా ఇగ్నైట్ రూపంలో వివిధ పేర్లతో ప్రజలను వంచిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు బాధితులు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. భారీస్థాయిలో ప్రజలు ఆర్థికంగా నష్టపోకముందే ఇలాంటి మనీ సర్క్యులేషన్ రాకెట్లను గుర్తించి, వాటిని నిర్మూలించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సీపీ సజ్జనార్ వివరించారు.

# 'పెసా' సంగతేంది?

**నటుడు రాహుల్ రామకృష్ణ ఆర్టీఐ దరఖాస్తు**



హైదరాబాద్, జూన్ 11 (ఈవార్తలు): ప్రముఖ సినీ నటుడు రాహుల్ రామకృష్ణ రెండు తెలుగు రాష్ట్రాల్లో గిరిజనుల హక్కుల కోసం ఉద్దేశించిన 'పెసా' చట్టం (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయతీల విస్తరణ చట్టం, 1996) అమలు తీరుపై ప్రభుత్వాలను నిలదీశారు. ఈ చట్టం క్షేత్రస్థాయిలో ఏ మేరకు అమలవుతోందో తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా వివరాలు కోరుతూ ఆయన దరఖాస్తులు దాఖలు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలను ఉద్దేశించి తాను అడిగిన ప్రశ్నలను, ఆర్టీఐ దరఖాస్తుల డిజిటల్ కాపీలను ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేయడంతో ఈ విషయం ఇప్పుడు రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన 2014 జూన్ 2 నుంచి నేటి వరకు, ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్నేళ్లుగా పెసా చట్టం అమలుకు తీసుకున్న చర్యలపై రాహుల్ రామకృష్ణ వివరాలు కోరారు. గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల నుంచి కీలకమైన పత్రాలు, ఫైళ్లను అందించాలని తన దరఖాస్తులో పేర్కొన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధి, గ్రామసభల బలోపేతం కోసం ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నాయి, వాటి కోసం ఎంత నిధులు ఖర్చు చేశాయనే అంశాలపై ఆయన దృష్టి సారించారు. గిరిజన ప్రాంతాల్లో గ్రామసభల ఏర్పాటు, ఆయా ప్రాంతాల సరిహద్దుల గుర్తింపునకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓలు), సర్క్యులర్ల కాపీలను అందించాలని రాహుల్ తన ఆర్టీఐ దరఖాస్తులో కోరారు. 2019 నుంచి 2026 మధ్య జిల్లాల వారీగా ఎన్ని గ్రామసభలు నిర్వహించారు, వాటి హాజరు పట్టికలు, సమీక్షా నివేదికలు ఏమిటని ప్రశ్నించారు. పెసా చట్టం అమలులో లోపాలను ఎత్తిచూపుతూ కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్, గవర్నర్ కార్యాలయం నుంచి వచ్చిన లేఖల వివరాలను కూడా బయటపెట్టాలని డిమాండ్ చేశారు. చట్టంపై అవగాహన సదస్సులు, శిక్షణా కార్యక్రమాలకు కేటాయించిన నిధులు ఎంత, వాటిలో ఎంత ఖర్చు చేశారో సంవత్సరాల వారీగా, జిల్లాల వారీగా లెక్కలు చెప్పాలని కోరడం గమనార్హం. పెసా చట్టం ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాల్లో మైనింగ్, భారీ ప్రాజెక్టులు, పరిశ్రమల కోసం భూమిని సేకరించాలంటే స్థానిక గ్రామసభల ముందస్తు అనుమతి తప్పనిసరి. ఈ నేపథ్యంలో, రెండు రాష్ట్రాల్లో జరిగిన భూసేకరణ ప్రతిపాదనలు, వాటికి గ్రామసభలు ఆమోదం తెలుపుతూ చేసిన తీర్మానాల కాపీలను సమర్పించాలని రాహుల్ రామకృష్ణ కోరారు. భూసేకరణ వల్ల నిర్వాసితులైన గిరిజనుల పునరావాసం కోసం చట్ట నిబంధనలను ఏ మేరకు పాటించారో తెలిపే రికార్డులను కూడా చూపించాలని తన దరఖాస్తులో పేర్కొన్నారు. గిరిజన భూవివాదాలు, కోర్టు కేసులు, అందిన ఫిర్యాదులపై పూర్తి డేటాతో పాటు, పెసా అమలుపై రూపొందించిన తాజా సమగ్ర నివేదికల కాపీలను డిజిటల్ రూపంలో అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రూ.9.63 కోట్ల పన్ను చెల్లించండి

**జొమాటోకు ఏపీ ప్రభుత్వం నోటీసు**




విజయవాడ, జూన్ 11 (ఈవార్తలు): ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటోకు ఏపీ జీఎస్టీ (వస్తు సేవల పన్ను) విభాగం ఊహించని షాక్ ఇచ్చింది. పన్ను ఎగవేత ఆరోపణలపై ఏకంగా రూ.9.63 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నోటీసులు జారీ చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీఎస్టీ చెల్లింపుల్లో వ్యత్యాసాలు ఉన్నాయని, తక్కువ పన్ను చెల్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు జొమాటో మాతృసంస్థ అయిన 'ఎటెర్నల్' కు ఈ నోటీసు అందింది. వివరాల్లోకి వెళితే.. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి మధ్య కాలానికి సంబంధించిన జీఎస్టీ లెక్కల్లో లోపాలు ఉన్నాయని ఏపీ జీఎస్టీ అధికారులు ఆరోపించారు. వాస్తవంగా చెల్లించాల్సిన దానికంటే తక్కువగా పన్ను చెల్లించారని పేర్కొన్నారు. ఈ మేరకు తమకు జూన్ 9న ఏపీ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం నుంచి ఆర్డర్ అందినట్లు జొమాటో మాతృసంస్థ ఎటెర్నల్ తన స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో అధికారికంగా వెల్లడించింది. జీఎస్టీ అధికారులు జారీ చేసిన నోటీసు ప్రకారం.. మొత్తం రూ.9.63 కోట్ల డిమాండ్‌లో అసలు పన్ను బకాయి రూ.6.49 కోట్లుగా ఉంది. దీనిపై వడ్డీగా రూ.2.50 కోట్లు, పెనాల్టీ కింద మరో రూ.64.87 లక్షలు కలిపి చెల్లించాలని ఆదేశించారు. ఈ నోటీసుపై కంపెనీ స్పందిస్తూ, తాము దీనిపై అప్పీల్‌కు వెళ్లనున్నట్లు స్పష్టం చేసింది. "2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి కాలానికి సంబంధించి జీఎస్టీ డిమాండ్‌ను నిర్ధారిస్తూ కంపెనీకి 2026 జూన్ 9న ఒక ఆర్డర్ అందింది. అయితే, ఈ విషయంలో మా వాదనలో బలమైన అంశాలు ఉన్నాయని మేము విశ్వసిస్తున్నాము. కంపెనీ ఈ ఉత్తర్వుపై సంబంధిత అధికార సంస్థ ముందు అప్పీల్ దాఖలు చేస్తుంది" అని ఎటెర్నల్ సంస్థ తన ఫైలింగ్‌లో పేర్కొంది. ఈ నోటీసుల వల్ల కంపెనీ ఆర్థిక కార్యకలాపాలపై గానీ, ఇతర కార్యకలాపాలపై గానీ ఎలాంటి ప్రతికూల ప్రభావం పడబోదని కూడా స్పష్టం చేసింది.

## ట్రంప్ బాధ్యత లేనోడు: ఒవైసీ

హైదరాబాద్, జూన్ 11 (ఈవార్తలు): హర్మూజ్ జలసంధి సమీపంలో 'సెటెబెల్లో' వాణిజ్య నౌకపై జరిగిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించడంపై ఎంఐఎం చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. ఈ ఘోర దాడిని తీవ్రంగా ఖండిస్తూ, అంతర్జాతీయ జలాల్లో జరుగుతున్న ఈ ఉద్రిక్తతలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న దూకుడు విధానాలే కారణమని ఆయన ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని, ఆయన తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన ఇబ్బందులు సృష్టిస్తున్నాయని ఒవైసీ విమర్శించారు. అంతర్జాతీయ వివాదాలతో ఎలాంటి సంబంధం లేని మన భారతీయ నావికుల ఓడలపై దాడులు జరుగుతున్నాయని, ఈ గొడవల వల్ల మనవాళ్లు ఎంతమంది ప్రాణాలు కోల్పోతున్నారో కేంద్ర ప్రభుత్వం ఒక్కసారి ఆలోచించాలని కోరారు. అదేవిధంగా, అంతర్జాతీయ నౌకాయాన మార్గాల్లో రక్షణ కల్పించడంలో అమెరికా సెంట్రల్ కమాండ్ తీవ్రంగా విఫలమైందని ఒవైసీ మండిపడ్డారు. అత్యంత కీలకమైన హర్మూజ్ ప్రాంతంలో మన ఓడలపై దాడులు జరుగుతుంటే, అక్కడ కాపలా కాస్తున్న సెంట్‌కామ్‌కు ఆ మార్గంలో ఎన్ని వాణిజ్య నౌకలు ప్రయాణిస్తున్నాయో తెలియదా అని ప్రశ్నించారు.

## ఏఎస్సైకి సైబర్ నేరగాళ్ల షాక్

**చలాన్ మెసేజ్‌తో ఏపీకే ఫైల్.. ఓపెన్ చేయగానే 49 వేలు మాయం**

హైదరాబాద్, జూన్ 11 (ఈవార్తలు): సైబర్ నేరగాళ్లు సామాన్యులనే కాకుండా, పోలీసు అధికారులను సైతం లక్ష్యంగా చేసుకుంటున్నారు. తాజాగా హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) సైబర్ మోసానికి గురయ్యారు. ఆర్టీఏ చలాన్ పేరుతో వచ్చిన ఒక నకిలీ లింక్‌ను క్లిక్ చేయడంతో, ఆయన బ్యాంకు ఖాతా నుంచి రూ. 49,139 మాయమయ్యాయి. వివరాల్లోకి వెళితే, పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న నరసయ్య మొబైల్ ఫోన్‌కు జూన్ 8న వరుసగా మెసేజ్‌లు వచ్చాయి. తన ప్రమేయం లేకుండానే బ్యాంకు ఖాతా నుంచి నగదు డెబిట్ అయినట్లు గమనించి ఆయన దిగ్భ్రాంతికి గురయ్యారు. అంతకుముందు ఆర్టీఏ చలాన్‌కు సంబంధించి వచ్చిన ఒక మెసేజ్‌లోని ఏపీకే ఫైల్‌ను ఆయన క్లిక్ చేశారు. దీనిని ఆసరాగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు, ఆయన బ్యాంకింగ్ వివరాలను తస్కరించి ఖాతాలోని సొమ్మును కాజేశారు. బాధిత ఏఎస్ఐ వెంటనే అప్రమత్తమై సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏపీకే ఫైల్స్, డిజిటల్ అరెస్ట్, నకిలీ ఓటీపీల వంటి మోసాలపై హైదరాబాద్ పోలీసులు నిరంతరం అవగాహన కల్పిస్తున్నప్పటికీ, సాక్షాత్తు ఒక పోలీస్ అధికారి ఇలాంటి మోసానికి గురికావడం ఆందోళన కలిగిస్తోంది.

## సర్‌పై అనవసర రాద్ధాంతం.. రాంచందర్ రావు

కుక్కునూరుపల్లి/సిద్దిపేట, జూన్ 11 (ఈవార్తలు): తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ ఇప్పుడు రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. ఈ అంశంపై బీజేపీని విమర్శిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే విపక్షాలు ఈ అంశాన్ని రాద్ధాంతం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా కుక్కునూరుపల్లి మండలం మత్పల్లిలో జరిగిన పార్టీ జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. గతంలో ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగినప్పుడు బీజేపీ పూర్తి స్థాయిలో మద్దతు తెలిపిందని గుర్తు చేశారు.

**మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.



## సర్కారు బడులను బతికిద్దాం

**డప్పు చప్పుళ్లతో టీచర్ ఇంటింటి ప్రచారం**

**మహబూబాబాద్ జిల్లాలో ఘటన**

మహబూబాబాద్, జూన్ 11 (ఈవార్తలు): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, వాటిలో విద్యార్థుల నమోదును పెంచే లక్ష్యంతో తెలంగాణలో ఓ ఉపాధ్యాయుడు వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మహబూబాబాద్ జిల్లా పాటిమీది గూడెం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు వి. గోపీనాథ్, నూతన విద్యా సంవత్సరంలో పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని కోరుతూ డప్పు చప్పుళ్లతో గ్రామమంతా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. కొంతమంది వాలంటీర్లతో కలిసి గ్రామ వీధుల్లో పర్యటిస్తూ, ఖరీదైన ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఆయన తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం విద్యార్థుల విద్యాభ్యాసం, పోషకాహారం కోసం చేపడుతున్న నూతన చర్యలను ఆయన ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. ఈ ప్రచారానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభిస్తుండగా, పలువురు తమ పిల్లలను ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ, గ్రామానికి గుడి ఎంత ముఖ్యమో, ప్రభుత్వ బడి కూడా అంతే అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడానికి రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు ఇటువంటి కృషి చేస్తున్నారని, బడిలో పిల్లలను చేర్పించి తమ ఊరి బడిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులపైనే ఉందని ఆయన స్పష్టం చేశారు. ఆయన చేపట్టిన ఈ చొరవ, రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో చేపడుతున్న విస్తృత సంస్కరణలకు అద్దం పడుతోంది. నూతనంగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు, ఉపాధ్యాయులకు ఏఐ టూల్స్ వంటి ఆధునిక సాంకేతికతలో శిక్షణ, స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల ఏర్పాటు వంటి చర్యలతో అధికారులు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మారుస్తున్నారు. గోపీనాథ్ వంటి ఉపాధ్యాయుల నిబద్ధత, ప్రభుత్వ ప్రయత్నాలకు తోడవ్వడం సర్కారీ బడుల పునరుజ్జీవానికి బాటలు వేస్తోంది.

## ఏపీ రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం

అమరావతి, జూన్ 11 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ కోటాలో ఖాళీ అయిన నాలుగు రాజ్యసభ స్థానాల ఎన్నిక ప్రక్రియ ఏకగ్రీవం అయింది. కూటమిలో భాగంగా తెలుగుదేశం పార్టీ నుంచి ముగ్గురు, జనసేన పార్టీ నుంచి ఒకరిని ఆయా పార్టీల అధిష్ఠానాలు బరిలోకి దింపాయి. టీడీపీ అభ్యర్థులుగా చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ, సానా సతీశ్ నామినేషన్లు దాఖలు చేయగా, జనసేన తరఫున లింగమనేని రమేశ్ నామినేషన్ వేశారు. ప్రత్యర్థి పార్టీల నుంచి ఎలాంటి నామినేషన్లు రాకపోగా, ఉపసంహరణ గడువు కూడా ఇవాళ్టితో ముగియడంతో ఈ నలుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ధృవీకరించారు.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబై: పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా ఇవాళ్టి ట్రేడింగ్‌లో భారత ఈక్విటీ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ఇరాన్‌పై అమెరికా తన సైనిక చర్యను తీవ్రతరం చేసిందనే వార్తలతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీనపడింది. రోజంతా ఒడుదొడుకులకు లోనైన సూచీలు చివరికి నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 150.63 పాయింట్లు నష్టపోయి 73,832.55 వద్ద, నిఫ్టీ 53.35 పాయింట్లు తగ్గి 23,161.60 వద్ద ముగిశాయి. ఇరాన్‌కు తగినంత సమయం ఇచ్చినా చర్చలకు రాలేదని, ఇప్పుడు పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్‌పై తీవ్రంగా దాడి చేస్తామని ఆయన స్పష్టం చేయడంతో మార్కెట్లలో ఆందోళన పెరిగింది. దీనికి తోడు అమెరికా దాడుల తర్వాత వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించడం ఆందోళనలను మరింత తీవ్రతరం చేసింది. ఈ పరిణామంతో ప్రపంచ చమురు సరఫరాకు అంతరాయం కలగవచ్చని, ఆర్థిక మార్కెట్లలో అనిశ్చితి పెరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈరోజు ట్రేడింగ్‌లో బ్రాడర్ మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి మరింత ఎక్కువగా కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.81 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.67 శాతం చొప్పున పతనమయ్యాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్, కెమికల్ సూచీలు అత్యధికంగా నష్టపోయాయి. మరోవైపు నిఫ్టీ మీడియా, ప్రైవేట్ బ్యాంక్, ఫార్మా సూచీలు మార్కెట్లకు మద్దతుగా నిలిచి నష్టాలను కొంతమేర తగ్గించాయి. మరోవైపు డాలర్‌కు పెరిగిన డిమాండ్ కారణంగా రెండు రోజుల లాభాల తర్వాత రూపాయి విలువ పడిపోయింది. ప్రస్తుతం ఇన్వెస్టర్లు పశ్చిమాసియా పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు. ఉద్రిక్తతలు మరింత పెరిగితే ముడిచమురు ధరలపై ప్రభావం పడి, ఈక్విటీ మార్కెట్లలో రిస్క్ సెంటిమెంట్ దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## మమతతోనే ఉంటా: శత్రుఘ్న సిన్హా

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాల చర్చ నడుస్తున్న వేళ పార్టీ ఎంపీ శత్రుఘ్న సిన్హా కీలక వ్యాఖ్యలు చేశారు. తాను టీఎంసీ తిరుగుబాటు వర్గంలో చేరనున్నట్టు జరుగుతున్న ప్రచారాన్ని కొట్టిపారేశారు. టీఎంసీతోనే కొనసాగుతానని, మమతా బెనర్జీకే తన పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. మమతా బెనర్జీ ఇప్పటికీ ప్రజల్లో బలమైన ఆదరణ కలిగిన నాయకురాలని శత్రుఘ్న సిన్హా అన్నారు. ప్రజల మధ్య ఉంటూ పోరాడే నాయకురాలిగా ఆమె మరోసారి నిరూపించుకున్నారని వ్యాఖ్యానించారు. ఇప్పటికీ ఆమెకు భారీ ప్రజా మద్దతు ఉందని చెప్పారు. తాను ఆమె వెంటే ఉన్నానని, తృణమూల్ కాంగ్రెస్‌తో తన ప్రయాణం కొనసాగుతుందని సిన్హా స్పష్టం చేశారు. పార్టీని వీడే ఉద్దేశం లేదని తేల్చి చెప్పారు. ఇటీవల టీఎంసీలో కొందరు నేతలు, ప్రజాప్రతినిధులు అసంతృప్తి స్వరాలు వినిపిస్తున్న నేపథ్యంలో శత్రుఘ్న సిన్హా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆయన కూడా రెబెల్ గ్రూప్‌తో చేరనున్నట్లు వస్తున్న ఊహాగానాలకు దీంతో కొంతవరకు చెక్ పడినట్టయింది.

## అభిషేక్ కావాలా? మేమా?

### మమతా బెనర్జీకి ఎంపీ కల్యాణ్ బెనర్జీ అల్టిమేటం

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్‌లో విభేదాలు మరింత ముదురుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీపై టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు. అభిషేక్ అహంకారం, ప్రవర్తనే పార్టీకి నష్టం తెచ్చిందని ఆరోపించారు. అవసరమైతే పార్టీని కూడా వీడేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. మమతా బెనర్జీకి కల్యాణ్ అత్యంత సన్నిహితుడిగా పేరుంది. ఓ కేసు విషయంలో తనను సంప్రదించకుండా మరో పిటిషన్ దాఖలు చేయడంపై కల్యాణ్ బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఇప్పటికే కోర్టులో వాదనలు వినిపించేందుకు సిద్ధమవుతున్న సమయంలో, మరో న్యాయవాదిని రంగంలోకి దించారని చెప్పారు. ఈ విషయాన్ని తనకు ముందుగా తెలియజేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను రాత్రి వరకు కేసుకు సిద్ధమయ్యానని, కానీ చివరి నిమిషంలో తన సేవలు అవసరం లేదని సమాచారం వచ్చిందని తెలిపారు. తన వద్ద జూనియర్లుగా పనిచేసిన న్యాయవాదులనే ఇప్పుడు తన స్థానంలో నియమించడం అవమానకరమని వ్యాఖ్యానించారు. ఓ సీనియర్ న్యాయవాదికి ఇవ్వాల్సిన గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. అభిషేక్ బెనర్జీ తనను తాను రాజులా భావిస్తున్నారని కల్యాణ్ బెనర్జీ విమర్శించారు. పార్టీ కష్టకాలంలో తాను మమతా బెనర్జీ వెంటే నిలిచానని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు అభిషేక్ వైఖరి వల్ల పార్టీ తీవ్రంగా దెబ్బతింటోందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో పార్టీ అధినేత మమతా బెనర్జీ నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చిందని అన్నారు. తాను ఇప్పటికీ ఆమెకు మద్దతుగానే ఉన్నానని స్పష్టం చేశారు. అయితే అభిషేక్ లేకుండా పార్టీ ముందుకు సాగలేదని మమత భావిస్తే తాను పార్టీ నుంచి తప్పుకొంటానని హెచ్చరించారు. ఎవరు కావాలో తేల్చుకోవాలంటూ దీదీకి అల్టిమేటం జారీ చేశారు.

## మీనాక్షి పిటిషన్‌పై నేడు విచారణ

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికలకు సంబంధించిన వివాదంలో కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంకోర్టులో కొంత ఊరట లభించింది. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం విచారించేందుకు అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. అయితే ఎన్నికల ఫలితాలను తాత్కాలికంగా నిలిపివేసేలా ఆదేశాలివ్వాలన్న అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. మీనాక్షి తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ ఈ అంశాన్ని అత్యవసరంగా విచారించాలని సుప్రీం కోర్టును కోరారు. తెలంగాణలోని ఓ ప్రైవేట్ ఫిర్యాదుకు సంబంధించి ఆమెకు కేవలం నోటీసు మాత్రమే జారీ అయిందని వివరించారు. ఆ వ్యవహారంలో కోర్టు ఇంకా కేసును విచారణకు స్వీకరించలేదని, ఛార్జిషీట్ కూడా నమోదు కాలేదని తెలిపారు. దీన్ని క్రిమినల్ కేసుగా పరిగణించలేమని కాంగ్రెస్ వాదిస్తోంది. అందువల్ల నామినేషన్ పత్రాల్లో ఆ వివరాలను వెల్లడించాల్సిన అవసరం లేదని చెబుతోంది. ఎన్నికల నిబంధనల ప్రకారం కూడా ఆ దశలో సమాచారాన్ని తప్పనిసరిగా ఇవ్వాల్సిన అవసరం లేదని కోర్టు దృష్టికి సింఘ్వీ తీసుకెళ్లారు.

## నెలాఖరు నుంచి కాంగ్రెస్ ఆందోళనలు

### నిరుద్యోగం, పేపర్ లీక్‌లపై పోరుబాట

**ఉద్యమం 2-3 నెలలు కొనసాగే అవకాశం**

న్యూఢిల్లీ: నిరుద్యోగం, పేపర్ లీక్‌లు, ధరల పెరుగుదల వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ నెలాఖరు నుంచి దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కే.సి. వేణుగోపాల్ ప్రకటించారు. ఈ కార్యక్రమాలు రెండు నుంచి మూడు నెలలపాటు కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ అధ్యక్షులు, ఇన్‌ఛార్జ్‌లు, ప్రధాన కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. నిరుద్యోగం పెరగడం, వరుసగా పేపర్ లీక్‌లు జరగడం, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయని వేణుగోపాల్ చెప్పారు. ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలు పెరుగుతూనే ఉన్నాయని విమర్శించింది. మరోవైపు ఉద్యోగావకాశాలు తగ్గిపోవడంతో యువత భవిష్యత్తుపై ఆందోళన చెందుతోందని పేర్కొంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమల పరిస్థితి కూడా దెబ్బతిందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఈ అంశాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఈ వ్యవహారంపై న్యాయపరంగా, రాజకీయంగా పోరాడాలని పార్టీ నిర్ణయించినట్లు వేణుగోపాల్ వెల్లడించారు.




# సంక్షోభంలో ప్రపంచం


### అయినా భారత్ ప్రగతి.. సమాఖ్య స్ఫూర్తిగా మా పాలన.. నీతి ఆయోగ్ భేటీలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: ఢిల్లీలో 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత ప్రగతి ప్రస్థానాన్ని మరింత వేగవంతం చేయడానికి కేంద్రం, రాష్ట్రాలు కలసికట్టుగా పనిచేస్తున్నాయని మోదీ అన్నారు. సహకారాత్మక ఫెడరలిజమ్ స్ఫూర్తిగా పనిచేస్తున్నామని ఆయన అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడానికి కేంద్రం, రాష్ట్రాలు సమిష్టిగా ప్రయత్నం చేస్తున్నాయంటూ మోదీ వివరించారు. ప్రపంచం ఎన్నో సంక్షోభాలు ఎదుర్కొంటుందని , కానీ ఆ సంక్షోభాల ప్రభావం భారత్‌పై లేదన్నారు మోదీ. స్టార్టప్‌లు , రైతులు , మహిళా పారిశ్రామికవేత్తలకు ఎంతో ప్రోత్సాహం ఇస్తునట్టు తెలిపారు. కేంద్రం , రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నీతిఆయోగ్ వారధిలా పనిచేయాలని మోదీ సూచించారు. వివిధ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. సమావేశంలో దాదాపు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులు, నీతి ఆయోగ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. లింగ, ప్రాంతీయ, సామాజిక-ఆర్థిక భేదాలు లేకుండా దేశంలోని ప్రతి పౌరుడికి ఆరోగ్యం, సరైన పోషకాహారం, భవిష్యత్తుకు సరిపడే నైపుణ్యాభివృద్ధి, ఉత్పాదక ఉపాధిని కల్పించడంపై ఇందులో సుదీర్ఘంగా చర్చించారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సుపరిపాలన ద్వారా ఈ అభివృద్ధి ఫలాలను క్షేత్రస్థాయిలోకి ఎలా తీసుకెళ్లాలనే దానిపై స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ఈ సమావేశంలో ఖరారు చేశారు.

## 4400 మంది ఉద్యోగులు కోటీశ్వరులు

### స్పేస్‌ఎక్స్ ఐపీఓ సంచలనం




న్యూయార్క్: ప్రముఖ అంతరిక్ష పరిశోధన సంస్థ స్పేస్‌ఎక్స్ త్వరలో పబ్లిక్ ఇష్యూకు (ఐపీఓ) రాబోతోంది. ఈ ఐపీఓ విజయవంతమైతే, ఆ సంస్థలో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులు రాత్రికిరాత్రే కోటీశ్వరులు కావడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ పరిణామం కార్పొరేట్ ప్రపంచంలో సంచలనంగా మారింది. స్టాక్ మార్కెట్ చరిత్రలోనే ఇది అతిపెద్ద ఐపీఓగా నిలిచిపోయే అవకాశాలున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. కంపెనీ ఒక్కో షేరు ధరను 135 డాలర్లుగా నిర్ణయించే అవకాశం ఉంది. ఈ ధర వద్ద కంపెనీ మొత్తం మార్కెట్ విలువ 1.77 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. ఈ లెక్కన, సంస్థలోని ప్రస్తుత, మాజీ ఉద్యోగుల్లో సుమారు 4,400 మంది తమ స్టాక్ హోల్డింగ్స్ ద్వారా మిలియనీర్లు (1 మిలియన్ డాలర్లకు పైగా సంపద) అవుతారని 'న్యూయార్క్ టైమ్స్' నివేదిక వెల్లడించింది. వీరిలో దాదాపు 400 మంది ఉద్యోగుల సంపద 100 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువగా ఉంటుందని అంచనా. సాధారణంగా ఐపీఓలలో కంపెనీ వ్యవస్థాపకులు, కొద్దిమంది ఉన్నతస్థాయి అధికారులు మాత్రమే అత్యధికంగా లాభపడతారని, కానీ స్పేస్‌ఎక్స్ విషయంలో ఇది భిన్నంగా ఉందని హిల్.కామ్ సీఈఓ ఆండ్రూ బెన్సన్ అన్నారు. "ఒకే కంపెనీలో 400 మందికి పైగా 100 మిలియన్ డాలర్ల సంపదను కలిగి ఉండటం చాలా అరుదైన విషయం. స్పేస్‌ఎక్స్ ఎంత భారీ సంపదను సృష్టించిందో ఇది తెలియజేస్తుంది" అని ఆయన వివరించారు. 2011లో స్పేస్‌ఎక్స్‌లో చేరిన ట్రెవర్ హైస్ అనే ఉద్యోగి కథే ఇందుకు నిదర్శనం. అప్పుడు కంపెనీ చాలా చిన్నది. ఆయనకు పరిహారంలో భాగంగా 1,00,000 షేర్లను ఇచ్చారు. ఐపీఓ ధర 135 డాలర్లుగా ఉంటే, ఆయన షేర్ల విలువ ఏకంగా 13.5 మిలియన్ డాలర్లకు (సుమారు రూ. 129 కోట్లు) చేరుకుంటుంది. "స్పేస్‌ఎక్స్ ఉద్యోగులకు నగదు కంటే ఎక్కువగా ఈక్విటీ (షేర్లు) రూపంలో పరిహారం ఇచ్చింది. ఐపీఓ తర్వాత ఈ సంపదంతా ఒక్కసారిగా రియల్ ఎస్టేట్ మార్కెట్లోకి ప్రవహించే అవకాశం ఉంది" అని రియల్ ఎస్టేట్ సంస్థ రీల్టర్.కామ్ సీనియర్ ఆర్థికవేత్త హన్నా జోన్స్ తెలిపారు.

## 500 తిమింగళాల అస్థిపంజరాలు

### హిందూ మహాసముద్రంలో వెలుగులోకి




బీజింగ్: చైనా నేతృత్వంలోని అంతర్జాతీయ పరిశోధకులు సముద్ర గర్భంలో ఒక మహాద్భుతాన్ని ఆవిష్కరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత పురాతనమైన తిమింగలాల శ్మశానవాటికను హిందూ మహాసముద్రంలో గుర్తించారు. ఆస్ట్రేలియాకు పశ్చిమాన, దయామాంటినా ఫ్రాక్చర్ జోన్‌లో సుమారు 1,200 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రదేశం విస్తరించి ఉంది. సముద్ర మట్టానికి దాదాపు 7,000 మీటర్ల (23,000 అడుగులు) లోతులో ఈ అద్భుత ప్రపంచం బయటపడింది. 2023లో చైనాకు చెందిన 'ఫెండౌఝే' అనే ప్రత్యేక సబ్‌మెర్సిబుల్ సాయంతో 32 సార్లు సముద్ర గర్భంలోకి వెళ్లి ఈ పరిశోధనలు జరిపారు. ఈ యాత్రలో భాగంగా 485 ప్రదేశాలలో 500కు పైగా తిమింగలాల అస్థిపంజరాలు, శిలాజాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటిలో కొన్ని శిలాజాల వయసు 5.3 మిలియన్ సంవత్సరాలు (53 లక్షల ఏళ్లు) ఉంటుందని అంచనా వేశారు. ఇంత పెద్ద స్థాయిలో, ఇంత పురాతనమైన తిమింగలాల శ్మశానం బయటపడటం ఊహించలేదని ప్రధాన పరిశోధకులు జియాటోంగ్ పెంగ్ తెలిపారు. ఈ ప్రాంతంలో కొత్తగా అంతరించిపోయిన తిమింగలం జాతిని కూడా గుర్తించారు. సముద్రంలో చనిపోయిన తిమింగలాలు అడుగుకు చేరడాన్ని 'వేల్ ఫాల్స్' అంటారు. ఒక్కోసారి ఆహార కొరత ఉండే సముద్ర గర్భంలో ఈ కళేబరాలు పోషకాలతో కూడిన ఒయాసిస్సులా పనిచేస్తాయి. ఇక్కడ జెల్లీఫిష్, స్టార్‌ఫిష్, ఎముకలను తినే పురుగులు, ఇతర జీవుల సమూహాలను శాస్త్రవేత్తలు గమనించారు. వీటిలో చాలా వరకు జీవశాస్త్ర ప్రపంచానికి కొత్తవి కావచ్చని భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో పేరుకుపోయిన సేంద్రియ పదార్థం సుమారు 6.7 మిలియన్ టన్నుల కార్బన్‌ను నిల్వ చేసిందని, ఇది తిమింగలాల పరిణామం, సముద్ర జీవవైవిధ్యంపై అధ్యయనానికి కీలకమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ఆవిష్కరణపై ప్రముఖ పత్రిక 'నేచర్'లో జూన్ 10న ఒక అధ్యయనం ప్రచురితమైంది.

## కోడలిపై మామ అత్యాచారం

### ఫోన్‌లో భర్త ట్రిపుల్ తలాక్

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని బహ్రాయిచ్ జిల్లాలో సభ్యసమాజం తలదించుకునే దారుణ ఘటన ఒకటి వెలుగు చూసింది. అండగా నిలవాల్సిన మామ అఘాయిత్యానికి పాల్పడగా, ఆ అన్యాయం గురించి భర్తకు చెప్పుకుంటే అతడు ఫోన్‌లో ట్రిపుల్ తలాక్ చెప్పి బంధాన్ని తెంచుకున్నాడు. ఆమె ఫిర్యాదు మేరకు భర్త, మామ సహా ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. లక్నోకు చెందిన ఓ మహిళకు 2023లో బహ్రాయిచ్ నివాసితో ముస్లిం సంప్రదాయం ప్రకారం వివాహమైంది. రెండేళ్లపాటు వీరి కాపురం సజావుగానే సాగింది. అయితే, భర్త ఉద్యోగరీత్యా బయటకు వెళ్లిన తర్వాత ఇంట్లో ఒంటరిగా ఉన్న కోడలిపై మామ కన్నేశాడు. తుపాకితో బెదిరించి, చంపేస్తానని భయపెట్టి ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. చివరిగా ఈ ఏడాది జనవరి 24న కూడా లైంగిక దాడి చేయడంతో ఆమె గట్టిగా కేకలు వేసింది.



ఆమె అరుపులు విని వచ్చిన అత్త, ఆడపడుచు, బావ.. ఆమెను కాపాడాల్సింది పోయి, ఎదురు దాడికి దిగి తీవ్రంగా కొట్టారు. ఈ విషయాన్ని ఫోన్‌లో భర్తకు చెప్పగా, ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలుంటాయని అతడు కూడా బెదిరించాడు. ఈ నరకాన్ని భరించలేక బాధితురాలు లక్నోలోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఆ తర్వాత కొన్ని రోజులకు భర్త ఫోన్ చేసి, మూడుసార్లు 'తలాక్' చెప్పి విడాకులు ఇచ్చాడు. ఈ ఘటనపై రూపైదేహా పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ రమేశ్ కుమార్ రావత్ స్పందించారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా భర్త, మామ, అత్త, ఆడపడుచు, బావపై భారతీయ న్యాయ సంహిత, ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణ చట్టం-2019 (ట్రిపుల్ తలాక్ నిషేధ చట్టం) కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే, ఈ ఆరోపణలపై పోలీసులు భర్తను ప్రశ్నించగా, తన భార్యకు వేరొకరితో సంబంధం ఉందని, అందుకే కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయని ఆరోపించాడు. ప్రస్తుతం ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని, బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించి, సమగ్ర దర్యాప్తు తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

## రోడ్డు భద్రతకు వీ2వీ టెక్నాలజీ

### కేంద్రం కీలక ముందడుగు



న్యూఢిల్లీ: దేశంలో రహదారి ప్రమాదాలను గణనీయంగా తగ్గించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. వాహనాలు పరస్పరం సమాచారాన్ని పంచుకునేందుకు వీలు కల్పించే వెహికల్-టు-వెహికల్ కమ్యూనికేషన్ టెక్నాలజీకి సంబంధించిన ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. ఈ సాంకేతికత ద్వారా కార్లు, ట్రక్కులు మరియు ద్విచక్ర వాహనాలు తమ వేగం, దిశ, బ్రేకింగ్ వంటి అత్యవసర సమాచారాన్ని సమీపంలోని ఇతర వాహనాలకు ఎప్పటికప్పుడు చేరవేస్తాయి. మే 7న జరిగిన సీఎంవీఆర్ టెక్నికల్ స్టాండింగ్ కమిటీ సమావేశం అనంతరం ఈ ముసాయిదాను రూపొందించారు. దీనిపై సంబంధిత భాగస్వామ్య పక్షాలు జూన్ 20లోగా తమ అభిప్రాయాలను, సూచనలను తెలియజేయవచ్చు. ఈ టెక్నాలజీ మొబైల్ నెట్‌వర్క్‌పై ఆధారపడకుండా, ప్రత్యేకమైన షార్ట్-రేంజ్ రేడియో ఫ్రీక్వెన్సీ ద్వారా పనిచేస్తుంది. దీనివల్ల ముందు వెళుతున్న వాహనం అకస్మాత్తుగా బ్రేకులు వేసినా లేదా మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనం కనిపించకపోయినా, డ్రైవర్‌ను ఈ వ్యవస్థ ముందే అప్రమత్తం చేస్తుంది. ఈ వ్యవస్థలో కచ్చితమైన లొకేషన్ గుర్తింపు కోసం భారతీయ నావిగేషన్ వ్యవస్థ 'నావిక్' తో పాటు జీపీఎస్, గగన్ సాంకేతికతలను వినియోగిస్తారు. దీనిద్వారా సెకనుకు 10 సార్లు వాహన సమాచారాన్ని అప్‌డేట్ చేసే వీలుంటుంది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ సాంకేతికతను ఒక విప్లవాత్మక మార్పుగా అభివర్ణించారు. దీని సహాయంతో రోడ్డు ప్రమాదాలను 80 శాతం వరకు నివారించవచ్చని ఆయన అంచనా వేశారు. 2026 చివరి నాటికి కొత్తగా తయారయ్యే వాహనాల్లో ఈ టెక్నాలజీని తప్పనిసరి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు ప్రతి వాహనానికి సుమారు రూ. 5,000 నుంచి రూ. 7,000 వరకు ఖర్చు అవుతుందని అంచనా. 2024లో దేశవ్యాప్తంగా జరిగిన రహదారి ప్రమాదాల్లో దాదాపు 1.7 లక్షల మంది మరణించిన నేపథ్యంలో, ఈ నూతన సాంకేతికత ప్రయాణాలను మరింత సురక్షితం చేస్తుందని అధికారులు భావిస్తున్నారు.

### మోదీ నాలో విశ్వాసాన్ని నింపారు: రాధికా అంబానీ

ముంబై: అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించినప్పటికీ, తన కెరీర్‌ను అక్కడే కాకుండా భారతదేశంలో నిర్మించుకోవడానికి గల కారణాలను రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ చిన్న కోడలు, ఎన్‌కోర్ హెల్త్‌కేర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధికా అంబానీ వెల్లడించారు. దేశ ఆర్థిక వ్యవస్థపై విశ్వాసం, రాజకీయ సుస్థిరత, కుటుంబ బాధ్యత వంటి అంశాలే తనను స్వదేశానికి తిరిగి వచ్చేలా చేశాయని ఆమె స్పష్టం చేశారు. గురువారం 'ఇండియాస్ ఇంటర్నేషనల్ మూవ్‌మెంట్ టు ది యునైటెడ్ నేషన్స్' నిర్వహించిన ఒక కార్యక్రమంలో రాధికా అంబానీ మాట్లాడారు. న్యూయార్క్ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ చదివిన ఆమె, తాను భారత్‌కు తిరిగి వచ్చే నాటి పరిస్థితులను గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నారని, ఎన్నికల ప్రచారం, నిరసనలతో రాజకీయంగా తీవ్ర గందరగోళం నెలకొని ఉందని వివరించారు. "ఆ సమయంలో ట్రంప్ అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్నారు. ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. పరిస్థితులు చాలా గందరగోళంగా ఉండేవి" అని ఆమె అన్నారు. అదే సమయంలో భారతదేశంలో పరిస్థితులు పూర్తి భిన్నంగా, ఎంతో ఆశాజనకంగా ఉన్నాయని రాధికా తెలిపారు. బీజేపీకి బలమైన మెజారిటీ లభించడం, ఆధార్, యూపీఐ వంటి డిజిటల్ మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందడం, రిలయన్స్ జియో ప్రారంభం కావడం వంటి సానుకూల పరిణామాలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ఆనాడు భారత ఆర్థిక వ్యవస్థ 8.5 శాతం వృద్ధి రేటుతో దూసుకెళ్తుండగా, అమెరికా వృద్ధి కేవలం 2-3 శాతంగానే ఉందని గుర్తుచేశారు. న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న సభకు హాజరవడం తనలో మరింత స్ఫూర్తిని నింపిందని, దేశ భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంచిందని ఆమె చెప్పారు.

### 50,000 ఉద్యోగులకు ఏఐలో టాటా శిక్షణ

న్యూఢిల్లీ: భారత ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో మరో భారీ ముందడుగు వేసింది. అమెరికాకు చెందిన ప్రముఖ ఏఐ సంస్థ 'ఆంత్రోపిక్' తో గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ ఒప్పందంలో భాగంగా తమ సంస్థలోని 50,000 మంది ఉద్యోగులకు ఆంత్రోపిక్ అభివృద్ధి చేసిన 'క్లాడ్' ఫ్యామిలీ ఏఐ మోడల్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఎంటర్‌ప్రైజ్ స్థాయిలో ఏఐని విస్తృతంగా స్వీకరించే వ్యూహంలో ఇది ఒక కీలకమైన అడుగు అని టీసీఎస్ పేర్కొంది. ఈ భాగస్వామ్యం ద్వారా క్లాడ్ ఏఐ మోడల్స్‌పై పరిశ్రమలకు అవసరమైన సొల్యూషన్స్ అందించేందుకు టీసీఎస్ ఒక ప్రత్యేక బిజినెస్ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ముఖ్యంగా బ్యాంకింగ్, బీమా, లైఫ్ సైన్సెస్ వంటి అత్యంత నియంత్రిత పరిశ్రమలలో ఏఐ ప్రాజెక్టులను కేవలం ప్రయోగాత్మక దశ నుంచి పూర్తిస్థాయి ఉత్పత్తి దశకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పెట్టుకుంది. టీసీఎస్ అందిస్తున్న పాలన, నియంత్రణలు, అమలులో ఉన్న నైపుణ్యాలను క్లాడ్ ఏఐ సామర్థ్యాలతో కలపడం ద్వారా సంస్థలు ప్రయోగాలకే

# ఆహార కల్తీ పై అవగాహన కార్యక్రమాలు

జగిత్యాల, జూన్ 11 (ఈవార్తలు): రాష్ట్రంలో ఆహార కల్తీ అరికట్టడానికి కృషి చేయాలని దక్షిణాది రాష్ట్రాల సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్ కోరారు. గురువారం జగిత్యాలలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు, వినియోగదారుల ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న ఆయన.. వినియోగదారుల్లో చైతన్యం లేని కారణంగా నిరంతరం ఆహార కల్తీ విచ్చలవిడిగా పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార కల్తీ చట్టాలు ఆయా చట్టాలకు రోజురోజుకు జరిగిన సవరణలు పట్ల వినియోగదారుల ప్రతినిధులు అధికారులతో కలిసి ముమ్మరంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని డా. పల్లె పాడు దామోదర్ తెలిపారు. ఆహార కల్తీ ఎక్కువ శాతం వంట నూనెలు, కారంపొడి, మసాలా దినుసుల్లో జరుగుతున్నదని, బహుళ జాతి సంస్థలు కూడా అనుచిత వ్యాపార పద్ధతుల్లో కల్తీ ఆహార పదార్థాలను వినియోగదారులకు అంటగడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు మాట్లాడుతూ బహుళ జాతి వ్యాపార సంస్థలైన వివిధషాపింగ్ మాల్స్, ఉచిత బహుమతులతో, డిస్కౌంట్లతో వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. ఒకటి కొంటే మరొకటి ఉచితం అని, కారంపొడి ప్యాకెట్లు, అల్లం పేస్టు, పసుపు ప్యాకెట్లను అంటగట్టడం పై వినియోగదారుల కోర్టులలో ఫిర్యాదులను నమోదు చేస్తున్నట్లు సాంబరాజు చక్రపాణి తెలిపారు. ఇదే సమావేశంలో పాల్గొన్న నిజామాబాద్ వినియోగదారుల సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శులు సందు ప్రవీణ్, మహాదేవుని శ్రీనివాసు, మహాదేవుని గణేశ్ లు ఆన్ లైన్ ఫుడ్ సంస్థల ఆహార కల్తీ పట్ల జాగ్రత్తగా ఉండాలని వినియోగదారులకు సూచించారు. అనంతరం ఉమ్మడి కరీంనగర్ జిల్లాల అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఖలీల్, కరీంనగర్, రంగారెడ్డి జిల్లా ఇన్స్పెక్టర్లు, సిరిసిల్ల జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అనూష, జగిత్యాల జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అనూష, ఇతర అధికారులకు వినియోగదారుల ప్రతినిధులు ఆయా ప్రాంతాల సమస్యలను విన్నవించారు.





## చివరి దశ ధాన్యం కొనుగోళ్లలో వేగం

**వర్షాలకు పంట తడవకుండా చర్యలు.. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలు**

బీర్‌పూర్, జూన్ 11 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో చివరి దశలో ఉన్న వరి ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. బీర్‌పూర్ మండల కేంద్రం, నరసింహులపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణాలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని, కొనుగోలు చేసిన వెంటనే డేటా ఎంట్రీ చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని 24 గంటల్లో అన్లోడింగ్ చేయాలని, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆర్‌డీఓ మధుసూదన్, తహసిల్దార్, ఎంపీడీవో, సివిల్ సప్లై అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## బడుల్లో మౌలిక వసతులు ఉండాలి

**కొత్త విద్యా సంవత్సరం ఏర్పాట్లపై కోరుట్ల ఎమ్మెల్యే సమీక్ష**

కోరుట్ల, జూన్ 11 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కోరుట్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోరుట్ల నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు మరియు జూనియర్ కళాశాలల ప్రధానోపాధ్యాయులతో ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా త్వరలో ప్రారంభం కానున్న నూతన విద్యా సంవత్సరం నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లు, విద్యార్థులకు అవసరమైన మౌలిక సౌకర్యాలు, తరగతుల నిర్వహణ, విద్యా ప్రమాణాల మెరుగుదల తదితర అంశాలపై ప్రధానోపాధ్యాయులతో ఆయన చర్చించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల హాజరు పెంపు, ఫలితాల మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. విద్యా రంగ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను మరింత బలోపేతం చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి నారాయణ, ఎంఈఓలు కోరుట్ల నరేష్, మల్లాపూర్ దామోదర్ రెడ్డి, మెట్‌పల్లి కనకతార, ఇబ్రహీంపట్నం మధు తదితరులు, అలాగే పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.




## విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి

**మల్యాల పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ**

మల్యాల, జూన్ 11 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఐపీఎస్ సూచించారు. గురువారం మల్యాల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన స్టేషన్ పనితీరు, నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తులు, రికార్డుల నిర్వహణ, బీట్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు, నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధుల నిర్వహణలో సమర్థతతోనే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని పేర్కొన్నారు. సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి సంఘటన జరిగినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. రాత్రి పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి చోరీలు, గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్యాల సీఐ రవి, ఎస్ఐ నరేష్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలి

**మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే సంజయ్**

మెట్‌పల్లి, జూన్ 11 (ఈవార్తలు): మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ పాల్గొన్నారు. అనంతరం ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, కల్పిస్తున్న సౌకర్యాలు, మౌలిక వసతుల అభివృద్ధి, సిబ్బంది పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెండున్నరేళ్ల తర్వాత ప్రారంభమైన నూతన ఆసుపత్రి భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుధ్యం, అవసరమైన పరికరాలు, ఇతర సౌకర్యాలను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన చర్యలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు.

# దళిత మంత్రిపై అవినీతి ఆరోపణలా?

**డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య ఫైర్**



జగిత్యాల, జూన్ 11 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని మోతే పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గాజంగి నందయ్య విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు రాజకీయ అంశాలపై స్పందించారు. వరి ధాన్యం కొనుగోళ్లలో భారీ కుంభకోణం జరిగిందని మాజీ మంత్రులు జీవన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్ చేసిన ఆరోపణలు రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆయన విమర్శించారు. రూ.107 కోట్ల నుంచి రూ.110 కోట్ల వరకు అవినీతి జరిగిందని, అందుకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బాధ్యుడని ప్రతిపక్ష నేతలు ఆరోపించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. గతంలో ఇదే జీవన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్‌లు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారని, కొప్పుల ఈశ్వర్ మంత్రిగా ఉన్న సమయంలో కూడా ఇలాంటి విమర్శలు వచ్చాయని నందయ్య గుర్తుచేశారు. ప్రస్తుతం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌పై అదే తరహా ఆరోపణలు చేయడం ద్వారా దళిత మంత్రులను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారన్న భావన ప్రజల్లో ఏర్పడుతోందని ఆయన అన్నారు. ఈ ఏడాది గత ఏడాదితో పోలిస్తే వరి దిగుబడి గణనీయంగా పెరిగిందని, అందువల్ల పెద్ద మొత్తంలో ధాన్యం కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం లారీలకు జీపీఎస్ విధానం తప్పనిసరి చేయడం, ఆ విధానంపై వచ్చిన అభ్యంతరాలు, దానిని ఉపసంహరించుకునే ప్రక్రియలో జాప్యం కారణంగా వరి ధాన్యం రవాణా, కొనుగోలు ప్రక్రియ ఆలస్యమైందని వివరించారు. ఈ ఆలస్యాన్ని కుంభకోణంగా చిత్రీకరించడం తగదని, రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం నిరాధార ఆరోపణలు చేయకుండా వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని ప్రతిపక్ష నేతలకు సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## రెండు రోజుల్లో మృతదేహాలు స్వదేశానికి

**చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వెల్లడి**

**దుబాయ్‌లో ఎంబసీ అధికారులతో భేటీ**

**రషీద్ ఆసుపత్రిలో క్షతగాత్రుడికి పరామర్శ**

దుబాయ్/జగిత్యాల/చొప్పదండి, జూన్ 11 (ఈవార్తలు): దుబాయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గ వాసుల మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు దుబాయ్ వెళ్లిన చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం గురువారం ఉదయం దుబాయ్‌లోని ఎంబసీ అధికారులతో సమావేశమయ్యారు. మృతదేహాలను భారత్‌కు తరలించడంలో కొన్ని సాంకేతికపరమైన అంశాలు ఉన్నందున వాటిని రెండు రోజులలో పూర్తి చేసి మృతదేహాలను స్వదేశానికి పంపిస్తామని అధికారులు తెలిపినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రషీద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముత్యంపేటకు చెందిన సయ్యద్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని, తెలంగాణ ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. త్వరలోనే భారత్‌కు తిరిగి వచ్చేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# అక్రమ షెడ్లపై సమగ్ర చర్యలు చేపట్టాలి

**మున్సిపల్ కమిషనర్‌కు బీజేపీ వినతిపత్రం**



జగిత్యాల టౌన్, జూన్ 11 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో ప్రధాన రహదారుల వెంట ఏర్పడిన అక్రమ షెడ్లు, ఆక్రమణలను ఎలాంటి పక్షపాతం లేకుండా తొలగించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ జగిత్యాల పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్ మాట్లాడుతూ కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు, అక్కడి నుంచి గొల్లపల్లి రోడ్డు వరకు ప్రధాన రహదారుల ఇరువైపులా భారీగా అక్రమ షెడ్లు ఏర్పడ్డాయని తెలిపారు. వ్యాపారులు తమకు కేటాయించిన స్థలాల కంటే ముందుకు వచ్చి వ్యాపారాలు నిర్వహించడం వల్ల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో పాటు రోడ్డు ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందన్నారు. ఇటీవల మున్సిపల్ సిబ్బంది యావర్ రోడ్డులో కొన్ని షెడ్లను మాత్రమే తొలగించి, మిగతా ఆక్రమణలను అలాగే వదిలివేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న అన్ని అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ, ఒకవేళ యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరిస్తే పట్టణ ప్రజల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్, కౌన్సిలర్లు మిమ్మల నాగరాజు, సిరిపురం శ్రీలత శ్రీనివాస్, గట్టుపల్లి మానస జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షులు ఇట్యాల రాము, గ్యాదాసు రాజేందర్, పవన్ సింగ్, కొప్పు భాస్కర్, కార్యదర్శులు మేడిపల్లి పుష్పరెడ్డి, కాశెట్టి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## రాయపట్నం పొలాల్లో మంటలు

**చాకచక్యంగా స్పందించిన పోలీసులు**

**తప్పిన భారీ ప్రమాదం**

ధర్మపురి, జూన్ 11 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని రాయపట్నం-మద్దునూరు గ్రామాల మధ్య రహదారి సమీపంలో గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు వరి పొలంలో మంటలు చెలరేగాయి. మంటలు వేగంగా వ్యాపించే పరిస్థితి ఏర్పడటంతో సమీపంలోని ఇతర పంట పొలాలు, చెట్లు, ప్రజల ఆస్తులకు నష్టం వాటిల్లే ప్రమాదం నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే ధర్మపురి పోలీస్ స్టేషన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని చాకచక్యంగా వ్యవహరించి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. దీంతో మంటలు ఇతర పొలాలకు వ్యాపించకుండా నిలువరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో సబ్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌కుమార్, ఏఎస్ఐ భీంరావు, పోలీసు సిబ్బంది సంజీవ్, నరేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీందర్‌కుమార్ మాట్లాడుతూ పంట కోత అనంతరం వరి దుబ్బులు, పంట అవశేషాలను కాల్చడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఇటువంటి ఘటనల వల్ల పక్క పొలాల్లోని పంటలు, చెట్లు, పశువులు, సమీప నివాసాలకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలని, ఎలాంటి అగ్ని ప్రమాదం జరిగినా వెంటనే పోలీసులకు లేదా అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు ధర్మపురి పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని తెలిపారు.

## యావర్ రోడ్డు విస్తరణకు ఫైల్ సిద్ధం చేయాలి

**మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే సంజయ్ వినతి**

జగిత్యాల, జూన్ 11 (ఈవార్తలు): జగిత్యాల పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ గురువారం మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు జగిత్యాల పట్టణంలోని యావర్ రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని కోరారు. మిషన్ కాంపౌండ్ నుంచి కొత్త బస్టాండ్ సమీపంలోని మంచాల కృష్ణ పెట్రోల్ బంక్ వరకు రోడ్డు వెడల్పు కోసం ప్రభావిత ఆస్తుల యాజమాన్య పత్రాలను పరిశీలించి ఫైల్ సిద్ధం చేయాలని సూచించారు. అలాగే పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించి శాశ్వత షెడ్లు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. తోపుడు బండ్ల వ్యాపారులకు మాత్రం తగిన అవకాశాలు కల్పించాలని సూచించారు. బీట్ చౌరస్తాలో నిర్మించిన సమీకృత వెజ్-నాన్‌వెజ్ మార్కెట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి మటన్, చికెన్, చేపలు, పూలు, పండ్లు, కూరగాయల విక్రయాలు సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ అఖిల్, కౌన్సిలర్లు, దూమల రాజ్ కుమార్, కో-ఆప్షన్ సభ్యులు, అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, నాయకులు పాల్గొన్నారు.





## సింగరేణి కార్మికుల సమస్య పరిష్కారానికి కిషన్ రెడ్డికి వినతిపత్రం

న్యూఢిల్లీ, జూన్ 11: సింగరేణి కార్మికులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న మారుపేర్ల సమస్యను పరిష్కరించేందుకు బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రి దేవేందర్ పటేల్ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డిని గురువారం న్యూఢిల్లీలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ రికార్డుల్లో నమోదైన మారుపేర్ల కారణంగా కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పలు సంక్షేమ పథకాలు, ఉద్యోగ సంబంధిత ప్రయోజనాల పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సమస్య వల్ల కార్మికులకు దక్కాల్సిన హక్కులు ఆలస్యమవుతున్నాయని, వెంటనే జోక్యం చేసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్మికుల సమస్యలను శ్రద్ధగా విన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు బద్రి దేవేందర్ పటేల్ తెలిపారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మరియు గనుల శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో సమన్వయం చేసుకుని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా కృషి చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. సింగరేణి కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రి దేవేందర్ పటేల్ వెల్లడించారు. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరితగతిన చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

వయ్యారి చిత్రం



సాక్షి మాలిక్



## మెగా 158.. పొల్లాచి ప్యాకప్

మెగాస్టార్ చిరంజీవి, బాబీ కొల్లి కాంబినేషన్‌లో ఓ ప్రాజెక్టు రాబోతున్న విషయం తెలిసిందే. 'మెగా 158' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. ఈ క్రమంలోనే ఇప్పటికే తొలి షెడ్యూల్ కంప్లీట్ చేసుకోగా.. తాజాగా సెకండ్ షెడ్యూల్ కూడా కంప్లీట్ చేసుకున్నారు చిత్ర బృందం. మెగా 158కు సంబంధించిన సెకండ్ షెడ్యూల్ షూటింగ్ పొల్లాచిలో పూర్తైనట్లు తెలుపుతూ ఫోటోలు పంచుకున్నారు మేకర్స్. 'మెగా158 పొల్లాచి షెడ్యూల్ పూర్తయింది. చిరుబాబీ2 చిత్ర బృందం ప్రధాన తారాగణంతో కూడిన ముఖ్యమైన భాగాలను చిత్రీకరిస్తూ, అత్యంత ఉత్సాహభరితమైన షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. తదుపరి షెడ్యూల్ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో, చిత్ర బృందం సరికొత్త ప్రమాణాన్ని నెలకొల్పడానికి సిద్ధంగా ఉన్నారు' అంటూ తెలిపారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

## ఓజీ2 లోడింగ్..!




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఫ్యాన్స్‌కు పండుగ చేసుకునే అప్డేట్ ఒకటి వచ్చేసింది. 'ఉస్తాద్ భగత్ సింగ్' రిజల్ట్ తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ యాక్టింగ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టేశారని, ఇక రాజకీయాలపైనే పూర్తి ఫోకస్ పెట్టబోతున్నారని గత కొద్ది రోజులుగా నెట్టింట వార్తలు వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. వైరల్ న్యూస్‌కు చెక్ పెడుతూ 'పవర్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్' అఫీషియల్ అకౌంట్ నుంచి ఒక సాలిడ్ అప్డేట్ వచ్చింది. 'మాట ఇచ్చినట్లే ఆయన చేస్తారు.. సమయం ఎప్పుడనేది ఆయన మనకు తెలియజేస్తారు.. సుజీత్ విదేశాల నుండి తిరిగి వచ్చాక మనం చర్చిద్దాం.. ఓజీ2' అంటూ ఓ ప్రకటన రిలీజ్ చేశారు. ప్రస్తుతం ఈ వార్త వైరల్ అవుతుండగా.. ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. కాగా.. పవన్ కల్యాణ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఓజీ'. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య, ముప్పాళ రంగ రామన్ నిర్మించిన ఈ సినిమాకు సుజీత్ దర్శకత్వం వహించాడు. ఇమ్రాన్ హష్మీ, ప్రియాంకా అరుళ్ మోహన్, శ్రియా రెడ్డి, ప్రకాష్ రాజ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీ 2025లో విడుదలై మిక్స్‌డ్ టాక్ సొంతం చేసుకుంది.

## విజయ్‌కు జోడీగా మానస





విజయ్ దేవరకొండ.. విక్రమ్ కుమార్ దర్శకత్వంలో ఓ భారీ చిత్రం చేయబోతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన లేటెస్ట్ బజ్ నెట్టింట సందడి చేస్తుంది. ఇందులో మానస వారణాసిని హీరోయిన్‌గా ఎంపిక చేశారట చిత్ర బృందం. ఇప్పటికే కథ వినిపించగా మానస ఓకే చేసినట్లు ఫిలిమ్ వర్గాల్లో టాక్. 'దేవకీ నందన వాసుదేవ, కపుల్ ఫ్రెండ్లీ' చిత్రాలతో ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకున్న ఈ హోమ్లీ బ్యూటీ.. ఇప్పుడు విజయ్ దేవరకొండ సరసన హీరోయిన్‌గా నటిస్తుందనే వార్తలు వైరల్ అవుండగా.. ఈ కాంబినేషన్‌పై అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. అయితే దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది.

## సినిమా దెబ్బతింటే వాళ్లకు సంతోషం: జగపతి బాబు




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటించిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా పెద్ది బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్ల సాధిస్తోంది. మొదటి వారంలోనే ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు మూవీ టీమ్ అనౌన్స్ చేసింది. భారీ బడ్జెట్ తో తెరకెక్కిన ఆ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వస్తున్న వేళ, సోషల్ మీడియాలో మాత్రం నెగిటివ్ ప్రచారం కొనసాగుతుందనే చర్చ జరుగుతోంది. ఆ విషయంపై పెద్ది పోస్ట్ ప్రమోషన్స్ లో మాట్లాడిన జగపతి బాబు, ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కు ఉంటుందని చెప్పారు. ఒక సినిమా నచ్చితే ప్రశంసించడం, నచ్చకపోతే విమర్శించడం కామన్ అని తెలిపారు. కానీ కొందరు మాత్రం కావాలనే ఒక సినిమాను ఇబ్బంది పెట్టాలని చూస్తుండడం ఎప్పుడూ సరైన పద్ధతి కాదన్నారు. "కొంతమందికి సినిమా దెబ్బతింటే ఆనందం కలుగుతుంది. అది ఒక రకమైన తప్పుడు ఆనందం. సినిమా బాగా ఆడకూడదనే ఉద్దేశంతో ఏదో ఒకటి చేస్తుంటారు. సోషల్ మీడియాలో నెగిటివ్ పోస్టులు పెడతారు. ట్రోలింగ్ చేస్తారు" అంటూ జగ్గూభాయ్ అసహనం వ్యక్తం చేశారు. రామ్ చరణ్ పెద్ద స్టార్ కావొచ్చు, ఫైనాన్సియల్ గా స్ట్రాంగ్ బలమైన వ్యక్తి కావొచ్చు, కానీ ఒక సినిమా వెనుక హీరో ఒక్కరే ఉండరని జగపతి బాబు గుర్తు చేశారు. నిర్మాత పెట్టిన బడ్జెట్, దర్శకుడి కష్టం, టెక్నీషియన్స్ శ్రమ, వందలాది మంది వ్యక్తుల కష్టం కూడా ఒక సినిమా విజయంపై ఆధారపడి ఉంటాయని చెప్పారు. "వందల కోట్ల రూపాయలు పెట్టి సినిమా తీస్తారు. ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. అభిమానులు కూడా ఆ సినిమా కోసం ఎదురు చూస్తుంటారు. అలాంటి సమయంలో కావాలని సినిమాను దెబ్బతీయాలనుకోవడం సరికాదు" అని ఆయన అన్నారు.






## రష్మికనా? శ్రద్ధానా?

నేషనల్ క్రష్ రష్మిక మందాన- బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్ ఇద్దరూ భారతీయ సంస్కృతి, సంగీత రంగాలలో చెరపలేని ముద్ర వేసిన ఇద్దరు లెజెండరీ మహిళల బయోపిక్‌లతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ రెండు ప్రతిష్టాత్మక చిత్రాలు త్వరలోనే పట్టాలెక్కడానికి సిద్ధమవుతుండటంతో ఇద్దరిలో ఎవరు బెస్ట్ పెర్ఫార్మర్‌గా నిలుస్తారనే ఆసక్తికర చర్చ పరిశ్రమలో మొదలైంది. కర్ణాటక సంగీత సామ్రాజ్ఞి, భారతరత్న ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జీవిత కథ ఆధారంగా తెరకెక్కబోయే చిత్రంలో రష్మిక మందాన కథానాయికగా నటించబోతున్నట్లు తెలుస్తోంది. -జెర్సీ- వంటి ఎమోషనల్ క్లాసిక్ చిత్రాన్ని అందించిన ప్రతిభావంతుడైన దర్శకుడు గౌతమ్ తిన్ననూరి ఈ ప్రాజెక్టును హ్యాండిల్ చేస్తున్నారు. ఇప్పటి వరకు గ్లామరస్, కమర్షియల్ పాత్రలలో మెప్పించిన రష్మికకు ఇది కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన , సవాలుతో కూడిన పాత్ర అని చెప్పొచ్చు. ఎం.ఎస్. సుబ్బులక్ష్మి హావభావాలను, పవిత్రమైన వ్యక్తిత్వాన్ని వెండితెరపై పండించడం రష్మిక నటనా జీవితానికి పెద్ద పరీక్ష కానుంది. అటు.. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ మహారాష్ట్రకు చెందిన ప్రముఖ జానపద కళాకారిణి, తమాషా నృత్య సామ్రాజ్ఞి వీతాబాయి నారాయణ్ కావకర్ బయోపిక్‌లో నటిస్తోంది. ఈ చిత్రానికి -ఈట- అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. జానపద కళల కోసం, తన నృత్యం కోసం జీవితాన్ని ధారపోసిన ఒక అసాధారణ మహిళ కథ ఇది. శ్రద్ధా కపూర్ తన కెరీర్‌లో ఇప్పటికే హసీనా పార్కర్ బయోపిక్‌లో నటించిన అనుభవం ఉన్నప్పటికీ ఒక జానపద నర్తకిగా, భావోద్వేగాలతో కూడిన పాత్ర ఆమెకు సరికొత్త ఇమేజ్‌ను తెచ్చిపెడుతుందని బాలీవుడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇద్దరు నటీమణుల పాత్రలను పరిశీలిస్తే.. రష్మిక పోషిస్తున్న ఎం.ఎస్. సుబ్బులక్ష్మి పాత్ర అత్యంత శోభాయ మానమైనది, శాస్త్రీయమైనది , ప్రశాంతతతో కూడుకున్నది. కేవలం కళ్ల కదలికలతో, ముఖ కవళికలతో ఆ పాత్రలోని దైవత్వాన్ని పండించాల్సి ఉంటుంది.

## మాధురి, తృప్తి యాక్టింగ్ సూపర్: ప్రియాంక చోప్రా

గ్లోబల్ స్టార్ ప్రియాంకా చోప్రా జోనాస్ సోషల్ మీడియా వేదికగా బాలీవుడ్ లేటెస్ట్ ప్రాజెక్ట్ -మా బెహన్- చిత్రంపై అందులో నటించిన నటీనటులపై అభిమానాన్ని చాటుకున్నారు. చిత్ర పరిశ్రమలో వైవిధ్యమైన సినిమాలను ఎప్పుడూ ప్రోత్సహించే ప్రియాంక కంటెంట్ కు ముగ్ధురాలయ్యారు. ముఖ్యంగా ఇందులో ప్రధాన పాత్రలు పోషించిన సీనియర్ నటి మాధురీ దీక్షిత్, నేటి తరం క్రేజీ బ్యూటీ తృప్తి దిమ్రిల నటన స్క్రీన్ ప్రెజెన్స్ అద్భుతంగా ఉన్నాయంటూ కొనియాడారు. ఈ చిత్రంలో బాలీవుడ్ ఎవ్వర్ డ్యాన్సింగ్ క్వీన్ మాధురీ దీక్షిత్ -నేషనల్ క్రష్ తృప్తి దిమ్రి తొలిసారిగా కలిసి నటించారు. ఇద్దరి కాంబినేషన్ వెండితెరపై సరికొత్త మ్యాజిక్‌ను క్రియేట్ చేసిందని ప్రియాంకా చోప్రా అభిప్రాయపడ్డారు.




## నాని సినిమాలో రుక్మిణికి చాన్స్

యంగ్ అండ్ బ్యూటీఫుల్ హీరోయిన్ రుక్మిణి వసంత్.. ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన అతితక్కువ సమయంలోనే తనకంటూ ఓ ఇమేజ్‌ను క్రియేట్ చేసుకుంది. అందం, అభినయంతో సినీరంగంలో తనదైన ముద్ర వేసిన ఈ అమ్మడు.. 'సప్త సాగరాలు దాటి సైడ్ ఎ' సినిమాతో కన్నడతో పాటు తెలుగు ప్రేక్షకుల హృదయాలను కూడా సొంతం చేసుకుంటుంది. ప్రస్తుతం ఈ అమ్మడు చేతిలో పలు ఆఫర్లు ఉన్నట్లు తెలుస్తుండగా.. తాజాగా మరో బంపర్ ఆఫర్ అందుకున్నట్లు తెలుస్తుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రుక్మిణి.. తెలుగులో తన ఫేవరెట్ హీరో నాని అని తెలిపింది. ఆయన రేంజ్ డిఫరెంట్ అని, అతను చేసే సినిమాల్లో ఓ మీనింగ్ ఉంటుందని, అలాగే కొత్తదనంతో పాటు కామెడీ కూడా ఉంటుందని తన అభిప్రాయాన్ని పంచుకున్న ఈ బ్యూటీ.. ఆయనతో ఓ సినిమా చేయాలని ఉందని తెలిపింది. ఇందులో భాగంగానే.. నాని నిర్మాణంలో రాబోయే చిత్రానికి హీరోయిన్‌గా రుక్మిణి వసంత్‌ను ఖరారు చేసినట్లు ప్రజెంట్ టాక్. 'దండోరా' చిత్రంతో గుర్తింపు పొందిన మురళీకాంత్ దర్శకత్వంలో నాని ఒక ఆసక్తికరమైన కొత్త చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉంది.






## ఫిఫా షురూ..
# షకీరా హోరు!
### మెక్సికో స్టేడియంలో రచ్చరంబోలా ఆటపాటలతో ఊపేసిన పాప్ సింగర్





ప్రపంచవ్యాప్తంగా కోట్లది మంది ఫుట్‌బాల్ అభిమానులు ఎదురుచూస్తున్న 'ఫిఫా పురుషుల ప్రపంచకప్ 2026' పోరుకు తెరలేచింది. అమెరికా, కెనడా, మెక్సికో దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీ ప్రారంభోత్సవానికి.. మెక్సికో సిటీలోని ప్రతిష్టాత్మక ఎస్టాడియో అజ్టెకా మెక్సికో సిటీ స్టేడియం వేదికగా నిలిచింది. ప్రఖ్యాత పాప్ సింగర్ షకీరా తన ప్రదర్శనతో స్టేడియంను ఓ ఊపు ఊపారు.

**ఆమెతో పాటు జె బాల్విన్, అలెజాండ్రో ఫెర్నాండెజ్ వంటి పలువురు అంతర్జాతీయ కళాకారులు ఈ వేడుకల్లో భాగమయ్యారు. తొలిసారిగా ఈ విడతలో 48 జట్లు పాల్గొంటుండగా, మొత్తం 104 మ్యాచ్‌లు జరగనున్నాయి. గురువారం అర్ధరాత్రి 12:30 గంటలకు (భారత కాలమానం ప్రకారం) ప్రారంభ మ్యాచ్‌లో గ్రూప్-ఏ కి చెందిన ఆతిథ్య మెక్సికో, సౌతాఫ్రికా జట్లు తలపడ్డాయి. కడపటి వార్తలు అందేసరికి మెక్సికో ఒక గోల్ చేసి లీడ్‌లో ఉంది.**



#### భారత్‌లో ప్రసారాలు ఇలా..

ఫిఫా ప్రపంచ కప్ 2026 ఇండియాలో ప్రసారాల హక్కులను జీ టెలివిజన్ సొంతం చేసుకుంది. ప్రసార హక్కులతో పాటు, స్పోర్ట్స్ పోర్ట్‌ఫోలియోను బలోపేతం చేసుకుంది. విస్తరణ వ్యూహంలో భాగంగా ఈ నెట్‌వర్క్ నాలుగు కొత్త స్పోర్ట్స్ ఛానెళ్లను ప్రారంభించింది. అవి యునైట్8 స్పోర్ట్స్ 1, యునైట్8 స్పోర్ట్స్ 1 హెచ్‌డీ, యునైట్8 స్పోర్ట్స్ 2, యునైట్8 స్పోర్ట్స్ 2 హెచ్‌డీ లను ప్రారంభించింది. జీ ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ అయిన జీ5, ప్రపంచ కప్ ప్రసారాన్ని రెండు ప్లాన్‌ల కింద అందిస్తోంది. ఒకటి 799 రూపాయలతో నడిచే మూడు నెలల ప్లాన్, మరొకటి 1699 రూపాయలతో ఇయర్లీ ప్లాన్. అయితే జీ ఛానెళ్లు లేదా జీ5 అందుబాటులో లేని ప్రేక్షకులకు దూరదర్శన్ స్పోర్ట్స్ కొన్ని మ్యాచులను ప్రసారం చేయనున్నట్లు డీడీ ప్రకటించింది.

#### డీడీ స్పోర్ట్స్‌లో ప్రసారం అయ్యే మ్యాచులు ఇవే..

జూన్ 11న మెక్సికో, దక్షిణాఫ్రికా మధ్య జరిగే ప్రారంభ మ్యాచ్‌ను డీడీ స్పోర్ట్స్ ప్రసారం చేయనుంది. ఈ మ్యాచ్ ఇండియాలో జూన్ 12న అర్ధరాత్రి 12:30 గంటలకు ప్రసారం అవుతుంది. దీని తర్వాత, క్వార్టర్ ఫైనల్స్, సెమీ-ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లు డీడీ ఫ్రీ డిష్‌లో అందుబాటులో ఉంటాయి. క్వార్టర్ ఫైనల్స్ జూలై 9, 10 మరియు 11 తేదీలలో జరగనున్నాయి. సెమీఫైనల్స్ 14, 15 తేదీలలో జరుగుతాయి, ఫైనల్ జూలై 19న జరుగుతుంది.

## భారత జట్టులోకి ద్రవిడ్ కొడుకు

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, దిగ్గజ బ్యాట్స్‌మెన్ రాహుల్ ద్రవిడ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తనదైన బ్యాటింగ్‌తో క్రికెట్ ప్రియులను అలరించాడు. అలానే కోచ్ గా మారి.. భారత్‌కు పలు ఐసీసీ టోర్నీలు అందించాడు. తాజాగా మరో ద్రవిడ్ టీమిండియా జెర్సీని ధరించనున్నాడు. ద్రవిడ్ చిన్న కుమారుడైన వికెట్ కీపర్, బ్యాటర్ అన్వయ్ ద్రవిడ్‌కు భారత అండర్-19 జట్టులో చోటు దక్కింది. ఈ జట్టు వచ్చే నెలలో శ్రీలంకతో వన్డే సిరీస్ ఆడనుంది. శ్రీలంక పర్యటనకు బీసీసీఐ అండర్19 జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు యశ్వర్ధన్ సింగ్ చౌహాన్ సారథిగా వ్యవహరించనున్నాడు. కాగా జులై 4న ప్రారంభమయ్యే ఈ పర్యటనలో టీమిండియా-19 శ్రీ లంకతో వన్డే, ఫోర్ డే మ్యాచ్‌లు ఆడనుంది. వన్డే జట్టులోని ఇద్దరు వికెట్ కీపర్ బ్యాటర్లలో ఒకడిగా అన్వయ్‌కు సెలక్టర్లు అవకాశం ఇచ్చారు. గతేడాది నవంబరులో చివరగా అన్వయ్ ద్రవిడ్ భారత అండర్19 జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. స్వదేశంలో అఫ్గానిస్థాన్ అండర్19 జట్టుతో ఆడిన భారత్ 'బి' జట్టులో అతడు సభ్యుడిగా ఉన్నాడు. దేశీ క్రికెట్‌లో సత్తా చాటుతున్న ఈ వికెట్ కీపర్ బ్యాటర్‌కు సెలక్టర్లు తాజాగా మరోసారి అవకాశం ఇచ్చారు.

#### భారత అండర్-19 వన్డే జట్టు

సాగర్ విర్క్, యశ్వర్ధన్ సింగ్ చౌహాన్ (కెప్టెన్), లక్ష్య రాయచందాని (వైస్ కెప్టెన్), వినీత్ వీకే, అర్జున్ రాజ్‌పుత్, కుషాగ్రా ఓజా, రజత్ బఘెల్ (వికెట్ కీపర్), అన్వయ్ ద్రవిడ్ (వికెట్ కీపర్), అన్మోల్జీత్ సింగ్, వూట్కూరి యశ్వీర్ గౌడ్, రోహిత్ అనిల్ యాదవ్, శవిన్ వి, కావ్యా పరేశ్ పటేల్, మోహిత్ ఉల్వా. ఇషాన్ సూద్.




## వింబుల్డన్ సింగిల్స్ విజేతకు 40 కోట్లు!

వింబుల్డన్ టెన్నిస్ విజేతలకు ప్రైజ్‌మనీ పెంచేశారు. తమ ఆదాయంలో ఎక్కువ భాగాన్ని ఆటగాళ్లకు పంచనున్నారు. గత ఏడాదితో పోలిస్తే ప్రైజ్‌మనీ ఈసారి 20 శాతం పెంచారు. సింగిల్స్ విజేతకు 48 లక్షల డాలర్ల ప్రైజ్‌మనీ దక్కనున్నది. ఇది సుమారు 40 కోట్లు ఉంటుంది. ఇక ఫస్ట్ రౌండ్‌లో ఓడిన ప్లేయర్‌కు కనీసం 80 వేల పౌండ్లు ఇవ్వనున్నారు. క్వాలిఫయింగ్ కాంపిటీషన్ కోసం సుమారు 6 మిలియన్ల పౌండ్లు ఖర్చు చేస్తున్నారు. దీంట్లో 25 శాతం పెరుగుదల ఉన్నది. ఓవరాల్‌గా ప్రైజ్‌మనీ సుమారు 64.2 మిలియన్ల పౌండ్లుగా ఉంది. టోర్నీ చరిత్రలోనే అత్యధికంగా ఆటగాళ పారితోషకాన్ని పెంచామని, ఆటగాళ్లను దీన్ని స్వాగతిస్తారని అనుకుంటున్నాని, ఇది చాలా పెద్ద అమౌంట్ అని ఆల్ ఇంగ్లండ్ క్లబ్ చైర్ దెబోరా జీవన్స్ తెలిపారు. క్వాలిఫయింగ్ రౌండ్‌తో పాటు అన్ని రౌండ్ల గురించి ఆలోచించామన్నారు. గ్రాండ్‌స్లామ్ నిర్వహణ ద్వారా వస్తున్న ఆదాయంలో 16 శాతం ఆటగాళ్లకు ఇవ్వాలన్న డిమాండ్ ఉందన్నారు. ఇటీవల ముగిసిన ఫ్రెంచ్ ఓపెన్‌లో ప్రైజ్‌మనీ 9.5 శాతం పెంచారు.



## అఫ్గాన్ చేతిలో భారత్ ఘోర ఓటమి

శ్రీలంక వేదికగా జరుగుతున్న ట్రై నేషన్ 'ఎ' సిరీస్‌లో భారత్ 'ఎ' జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వర్షం కారణంగా ఈ మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 'ఎ' జట్టు డక్‌వర్త్ లూయిస్ (డీఎల్ఎస్) పద్ధతి ప్రకారం భారత్‌పై 4 పరుగుల తేడాతో సంచలన విజయం సాధించింది. ఈ ఓటమితో ప్రస్తుత సిరీస్‌లో టీమిండియా 'ఎ' జట్టు తన మొదటి పరాజయాన్ని చవిచూసింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 'ఎ' జట్టు నిర్ణీత ఓవర్లలో అద్భుత ప్రదర్శన చేసింది. భారత టాప్ ఆర్డర్ బ్యాటర్లు చెలరేగి ఆడటంతో 49 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 349 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (84 పరుగులు) జట్టుకు బలమైన పునాది వేయగా, కెప్టెన్ ఋతురాజ్ గైక్వాడ్ (66) మరియు తిలక్ వర్మ (66) హాఫ్ సెంచరీలతో రాణించి జట్టుకు కొండంత స్కోరును అందించారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ 'ఎ' జట్టు కూడా భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ వేగంగా పరుగులు రాబట్టింది. ఆ జట్టు 25.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసిన సమయంలో మ్యాచ్‌కు వర్షం తీవ్ర అంతరాయం కలిగించింది. ఎంతకీ వర్షం తగ్గకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను నిలిపివేసి, డీఎల్ఎస్ (ఋూా) పద్ధతి ప్రకారం విజేతను నిర్ణయించారు. వర్షం వచ్చే సమయానికి అఫ్గానిస్తాన్ 'ఎ' జట్టు ఉండాల్సిన రన్ రేట్ కంటే మెరుగైన స్థితిలో ఉండటంతో, కేవలం 4 పరుగుల (డీఎల్ఎస్) తేడాతో అఫ్గాన్‌ను విజేతగా ప్రకటించారు.

## 14 జట్లతో వన్డే ప్రపంచకప్

### అక్టోబర్ 1 నుంచి నవంబర్ 21 వరకు మెగా టోర్నీ.. 2027 వరల్డ్ కప్ ప్రాథమిక షెడ్యూల్ ఖరారు

ప్రపంచ క్రికెట్ అభిమానులు ఎంతగానో ఎదురుచూసే ఐసీసీ పురుషుల వన్డే ప్రపంచకప్-2027 షెడ్యూల్‌పై బిగ్ అప్‌డేట్ వచ్చింది. ఈ ప్రతిష్టాత్మక మెగా టోర్నమెంట్‌ను 2027 అక్టోబర్ 1 నుంచి నవంబర్ 21 వరకు నిర్వహించేందుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తాత్కాలికంగా తేదీలను ఖరారు చేసినట్లు సమాచారం. ఇందులో అక్టోబర్ 1 నుంచి 7 వరకు వార్మప్ మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఈ టోర్నీకి ఆతిథ్యమివ్వనున్నాయి. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో ఈ తేదీలపై ప్రాథమిక అంగీకారం కుదిరిందని సమాచారం. జూలైలో ఎడిన్‌బర్గ్‌లో జరిగే ఐసీసీ వార్షిక సాధారణ సమావేశంలో టోర్నీ షెడ్యూల్‌కు సంబంధించి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ టోర్నీలో మొత్తం 54 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో అత్యధికంగా దక్షిణాఫ్రికాలో 40 మ్యాచ్‌లు జరగనున్నట్లు తెలుస్తోంది. ఆ దేశంలోని 8 వేదికల్లో ఇవి నిర్వహిస్తారట. ఇక జింబాబ్వేలోని హరారే స్పోర్ట్స్ క్లబ్, బులవాయోలోని క్వీన్స్, విక్టోరియా ఫాల్స్ వంటి 3 వేదికల్లో 8 నుంచి 10 మ్యాచ్‌లు జరగనున్నాయి. మిగిలిన మ్యాచ్‌లకు నమీబియా ఆతిథ్యం ఇచ్చే అవకాశం ఉంది. జింబాబ్వేలో కొత్తగా నిర్మిస్తున్న 'ఫేల్ మోసి-ఓ-తున్యా' అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వచ్చే ఏడాది మే నెలలో లాంఛనంగా ప్రారంభం కానుంది. ఈ స్టేడియంలోనూ ప్రపంచకప్ మ్యాచ్ జరిగే అవకాశం ఉంది. కాగా భారత్ వేదికగా జరిగిన గత వన్డే ప్రపంచకప్‌లో మొత్తంగా 10 జట్లు పోటీ పడ్డాయి. కానీ 2027లో మాత్రం ఆ సంఖ్య 14కు పెరిగింది. ఈ 14 జట్లను తలా ఏడు చొప్పున రెండు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు 'సూపర్ సిక్స్' దశకు అర్హత సాధిస్తాయి.



## వన్డేల్లో నం.1గా టీమిండియానే!


భారత క్రికెట్ జట్టు ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్ స్థానాన్ని మరోసారి అంటిపెట్టుకుంది. తాజాగా విడుదల చేసిన వార్షిక ర్యాంకింగ్స్ అప్‌డేట్‌లో భారత క్రికెట్ జట్టు నెంబర్ -1 స్థానాన్ని దక్కించుకుంది. వన్డే క్రికెట్‌లో ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టుగా 'నెం.1' స్థానాన్ని టీమిండియా విజయవంతంగా నిలబెట్టుకుంది. అయితే, ఈ వార్షిక మార్పుల తర్వాత ద్వితీయ స్థానంలో ఉన్న న్యూజిలాండ్‌తో పోలిస్తే భారత్‌కు ఉన్న పాయింట్ల ఆధిక్యం ఎనిమిది నుంచి ఐదు పాయింట్లకు తగ్గింది. ఈ అప్‌డేట్ తర్వాత టీమిండియా ఖాతాలో ఒక పాయింట్ తగ్గి 118 పాయింట్లకు చేరుకోగా, కివీస్ జట్టు రెండు పాయింట్లను లాభపడి 113 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ప్రస్తుత ప్రపంచ కప్ ఛాంపియన్స్ అయిన ఆస్ట్రేలియా జట్టు ఎలాంటి మార్పు లేకుండా 109 పాయింట్లతో మూడో స్థానంలోనే స్థిరంగా కొనసాగుతోంది. కాగా, ఈసారి ఐసీసీ వన్డే టాప్-10 జట్ల జాబితాలో ఒకే ఒక మార్పు చోటుచేసుకుంది. అంతకుముందు వరకు నాలుగో స్థానంలో కొనసాగిన పాకిస్తాన్ (98 పాయింట్లు) ఐదో స్థానానికి పడిపోగా.. వారిని వెనక్కి నెట్టి దక్షిణాఫ్రికా జట్టు 102 పాయింట్లతో నాల్గవ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఒడిదుడుకులు ఎదురైనా అగ్రస్థానాన్ని కాపాడుకోవడంలో భారత్ సాధించిన ఈ విజయంపై మేనేజ్‌మెంట్, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
శుక్రవారం 12-6-2026, జగిత్యాల


నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# వర్షాలకు విరామం..!

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు దేశంలోకి సాధారణం కంటే ముందుగానే ప్రవేశించి రైతుల్లో కొత్త ఆశలు నింపాయి. గత కొన్నేళ్లుగా వాతావరణ మార్పుల కారణంగా అనిశ్చితంగా మారిన వర్షపాతం నేపథ్యంలో ఈ ముందస్తు రాక వ్యవసాయ రంగానికి శుభసూచకంగా కనిపించింది. అయితే, రుతుపవనాలు ఇప్పుడు మందగించడం ఆందోళన కలిగిస్తోంది. ఇది తాత్కాలిక విరామమే అయినప్పటికీ, దీర్ఘకాలం కొనసాగితే వ్యవసాయం నుంచి ద్రవ్యోల్బణం వరకు అనేక రంగాలపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. భారతదేశ వ్యవసాయం ఇప్పటికీ ప్రకృతిపై ఆధారపడిన రంగమే. దేశంలోని సాగుభూమిలో దాదాపు సగానికి పైగా భూమి వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడి ఉంది. జూన్ నెలలో వర్షాలు సకాలంలో పడితేనే రైతులు ఖరీఫ్ పంటల సాగును ప్రారంభిస్తారు. వరి, పత్తి, సోయాబీన్, మొక్కజొన్న, పప్పుధాన్యాల వంటి పంటల భవిష్యత్తు ఈ దశలో పడే వర్షాలపైనే ఆధారపడి ఉంటుంది. వర్షాలు ఆలస్యం అయితే విత్తనాల విత్తకం వెనక్కి వెళ్లడం, దిగుబడులు తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వ్యవసాయంపై ప్రభావం పడితే దాని ప్రతిధ్వని నేరుగా మార్కెట్‌లో వినిపిస్తుంది. ఆహార ధాన్యాలు, కూరగాయలు, పండ్ల ఉత్పత్తి తగ్గితే ధరలు పెరుగుతాయి. ఇప్పటికే అనేక కుటుంబాలు పెరుగుతున్న జీవన వ్యయంతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ఆహార ద్రవ్యోల్బణం మరింత భారంగా మారుతుంది. రిజర్వ్ బ్యాంక్ ద్రవ్యోల్బణ నియంత్రణ కోసం తీసుకుంటున్న చర్యలకు కూడా ఇది సవాలుగా మారే అవకాశం ఉంది. మంచి వర్షాలు ఉంటే ధరలు అదుపులో ఉంటాయి; వర్షాల కొరత ఉంటే ద్రవ్యోల్బణం మళ్లీ తలెత్తే ప్రమాదం ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా రుతుపవనాల చుట్టూనే తిరుగుతుంది. రైతుల ఆదాయం పెరిగితే గ్రామాల్లో వినియోగం పెరుగుతుంది. ద్విచక్ర వాహనాల నుంచి గృహోపకరణాల వరకు కొనుగోళ్లు పెరుగుతాయి. కానీ పంటలపై అనిశ్చితి ఏర్పడితే రైతులు ఖర్చులను తగ్గిస్తారు. దీని ప్రభావం చిన్న వ్యాపారాల నుంచి పెద్ద పరిశ్రమల వరకు కనిపిస్తుంది. గ్రామీణ డిమాండ్ తగ్గడం దేశ ఆర్థిక వృద్ధి వేగాన్నీ ప్రభావితం చేయగలదు. అయితే ప్రతి వర్ష విరామాన్ని సంక్షోభంగా చూడాల్సిన అవసరం లేదు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం మొత్తం సీజన్‌లో సాధారణం కంటే మెరుగైన వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఇంకా ఉన్నాయి. కానీ వాతావరణ మార్పుల కారణంగా వర్షాల పంపిణీ అసమానంగా మారుతున్న వాస్తవాన్ని విస్మరించరాదు. కొద్ది రోజుల్లో భారీ వర్షాలు, ఆ తర్వాత దీర్ఘకాల విరామాలు ఇప్పుడు కొత్త సాధారణంగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం, రాష్ట్రాలు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలి. సాగునీటి వనరులను బలోపేతం చేయడం, నీటి సంరక్షణ చర్యలను విస్తరించడం, రైతులకు సకాలంలో సలహాలు అందించడం అత్యవసరం. అలాగే పంటల బీమా, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం వంటి చర్యలు రైతులకు భరోసా కల్పించగలవు. రుతుపవనాలు కేవలం వర్షాలను మాత్రమే తీసుకురావు; అవి దేశ ఆర్థిక చక్రాన్ని ముందుకు నడిపించే శక్తి. అందుకే వర్షాలకు వచ్చిన ఈ విరామాన్ని ఒక హెచ్చరికగా తీసుకుని వ్యవసాయాన్ని మరింత స్థిరంగా, వాతావరణ మార్పులకు తట్టుకునేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. రైతు బాగుంటేనే గ్రామీణ భారత్ బలపడుతుంది; గ్రామీణ భారత్ బలపడితేనే దేశ ఆర్థిక వ్యవస్థ దృఢంగా నిలుస్తుంది.



# ఊరు

అప్పటి లాగా లేదు
ఇప్పటి ఊరు
పేగు బంధాలు పలుచ బడ్డాయి
డబ్బు సంబంధాలు గట్టి బడ్డాయి
ఎవడికి వాడే పెద్దమనిషి
గౌరవం అనే పదం వల
వేసి వెతికిన దొరకడం లేదు
ఎంతసేపు కుర్చీని
ఎలా గుంజాలనే ధ్యాస
వెరసి కుళ్ళ
రాజకీయాలతో మురికికూపంలోకి
జారుతు బేజరవుతున్న ఊరు!


**కవి: నాగం సాయిలు**
**(నానీ మీగడలు రచయిత)**
**పోన్:9490209937.**






భారతదేశం గత దశాబ్దంలో అనేక రంగాల్లో సంస్కరణలు, సాంకేతిక పరివర్తనలను చూసింది. అయితే వాటిలో అత్యంత ప్రభావవంతమైన మార్పు ఏదైనా ఉందంటే అది డిజిటల్ చెల్లింపుల విప్లవమే. ఒకప్పుడు నగదు ఆధారిత ఆర్థిక వ్యవస్థగా గుర్తింపు పొందిన భారత్, నేడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న డిజిటల్ పేమెంట్స్ ఎకోసిస్టమ్‌కు కేంద్రంగా నిలిచింది. చిన్న టీ దుకాణం నుంచి పెద్ద కార్పొరేట్ సంస్థల వరకు, గ్రామీణ రైతు బజారు నుంచి అంతర్జాతీయ వ్యాపార లావాదేవీల వరకు డిజిటల్ చెల్లింపులు విస్తరించాయి. ఈ పరివర్తనకు ప్రధాన కారణం యూపీఐ. బ్యాంకు ఖాతాల మధ్య క్షణాల్లో డబ్బు బదిలీ చేసే ఈ వ్యవస్థ భారత ఆర్థిక వ్యవస్థలో ఒక విప్లవాన్ని తీసుకొచ్చింది. కేవలం ఒక సాంకేతిక వేదికగా కాకుండా, సామాజిక-ఆర్థిక మార్పుకు దోహదపడిన ప్రజా డిజిటల్ మౌలిక వసతిగా యూపీఐ నిలిచింది. ప్రపంచంలోని అనేక దేశాలు ఇప్పుడు భారత నమూనాను అధ్యయనం చేస్తున్నాయి.

భారతదేశంలో చాలా కాలం వరకు నగదే ప్రధాన చెల్లింపు సాధనం. బ్యాంకింగ్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు పూర్తిగా చేరకపోవడం, సాంకేతిక పరిజ్ఞానం పరిమితంగా ఉండటం, డిజిటల్ మౌలిక వసతుల కొరత ఇందుకు కారణాలు. అయితే స్మార్ట్‌ఫోన్‌ల విస్తరణ, చౌకైన ఇంటర్నెట్ సేవలు, జనధన్ ఖాతాల ప్రారంభం, ఆధార్ అనుసంధానం, ప్రత్యక్ష నగదు బదిలీ వంటి కార్యక్రమాలు డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది వేశాయి. ఈ నేపథ్యంలో 2016లో ప్రవేశపెట్టిన యూపీఐ వ్యవస్థ ప్రజల జీవితాలను మార్చేసింది. ఒక మొబైల్ నంబర్ లేదా వర్చువల్ పేమెంట్ అడ్రస్ ద్వారా క్షణాల్లో డబ్బు పంపడం, స్వీకరించడం సాధ్యమైంది. బ్యాంకు వివరాలను పంచుకోవాల్సిన అవసరం లేకుండా, 24 గంటలూ, వారంలో ఏడు రోజులూ అందుబాటులో ఉండే వ్యవస్థగా ఇది నిలిచింది. నోట్ల రద్దు అనంతరం డిజిటల్ చెల్లింపుల వినియోగం వేగంగా పెరిగింది. తరువాత కరోనా మహమ్మారి సమయంలో కాంటాక్ట్‌లెస్ పేమెంట్ల అవసరం పెరగడంతో యూపీఐ వినియోగం మరింత విస్తరించింది. నేడు లక్షలాది మంది ప్రతిరోజూ కూరగాయలు కొనడం నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించడం వరకు యూపీఐని వినియోగిస్తున్నారు.



యూపీఐ విజయానికి అనేక కారణాలు ఉన్నాయి. యూపీఐ వినియోగానికి ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానం అవసరం లేదు. స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు. ఒక క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా చెల్లింపు పూర్తవుతుంది. నగదు లెక్కించే పని లేదు, చిల్లర కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదు. వ్యాపారులకు భారీ ట్రాన్సాక్షన్ చార్జీలు లేకపోవడం యూపీఐ విజయానికి ముఖ్య కారణం. చిన్న వ్యాపారులు కూడా సులభంగా డిజిటల్ చెల్లింపులను స్వీకరించగలుగుతున్నారు. ఒక యాప్ నుంచి మరొక యాప్‌కు, ఒక బ్యాంకు నుంచి మరో బ్యాంకుకు చెల్లింపులు సులభంగా జరగడం యూపీఐ ప్రత్యేకత. ఇది మూస వ్యవస్థ కాదు. అందరికీ అందుబాటులో ఉండే ఓపెన్ నెట్‌వర్క్. ప్రభుత్వం డిజిటల్ ఇండియా కార్యక్రమం ద్వారా డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించింది. బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు, నియంత్రణ సంస్థలు కలిసి పనిచేయడం కూడా విజయానికి దోహదపడింది. యూపీఐ కేవలం ఒక యాప్ కాదు. ఇది డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో భాగం. ఆధార్, జనధన్, మొబైల్ కనెక్టివిటీ వంటి వ్యవస్థలతో కలిసి పనిచేస్తూ సమగ్ర డిజిటల్ ఎకోసిస్టమ్‌ను నిర్మించింది.

యూపీఐ ప్రభావం కేవలం చెల్లింపులకే పరిమితం కాలేదు. ఇది ఆర్థిక సమ్మిళితతను పెంచింది. ఒకప్పుడు బ్యాంకింగ్ వ్యవస్థకు దూరంగా ఉన్న లక్షలాది మంది ఇప్పుడు డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యారు. చిన్న వ్యాపారులు కూడా అధికారిక ఆర్థిక వ్యవస్థలోకి వచ్చారు. లావాదేవీల రికార్డులు ఉండటం వల్ల వారికి రుణాలు పొందే అవకాశాలు పెరిగాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కూడా డిజిటల్ చెల్లింపులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయడం వల్ల మధ్యవర్తుల పాత్ర తగ్గింది. పారదర్శకత పెరిగింది. మహిళల ఆర్థిక సాధికారతకు కూడా ఇది దోహదపడింది. మొబైల్ ఫోన్ ద్వారా స్వతంత్రంగా లావాదేవీలు నిర్వహించే అవకాశం మహిళలకు లభించింది. యూపీఐ విజయాన్ని చూసి అనేక దేశాలు ఆసక్తి చూపుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలకే కాకుండా అభివృద్ధి చెందుతున్న దేశాలకు కూడా ఇది ఆదర్శంగా మారింది. ప్రపంచంలోని చాలా దేశాల్లో డిజిటల్ చెల్లింపులు ఉన్నప్పటికీ, అంత పెద్ద జనాభాలో తక్కువ ఖర్చుతో, అధిక స్థాయిలో అమలు చేసిన ఉదాహరణలు అరుదు. భారతదేశం మాత్రం కోట్లాది మందిని డిజిటల్ వ్యవస్థలోకి తీసుకురావడంలో విజయం సాధించింది. భారత నమూనా ప్రధాన బలం ఏమిటంటే, ఇది కేవలం ప్రైవేట్ కంపెనీల ఆధారిత వ్యవస్థ కాదు. ప్రజలకు అందుబాటులో ఉండే ఓపెన్ డిజిటల్ మౌలిక వసతులపై నిర్మితమైంది. అందుకే సింగపూర్, యూఏఈ, ఫ్రాన్స్, శ్రీలంక, భూటాన్ వంటి దేశాలతో యూపీఐ అనుసంధానం ప్రయత్నాలు జరుగుతున్నాయి. భవిష్యత్తులో అంతర్జాతీయ చెల్లింపుల రంగంలో కూడా యూపీఐ కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.



**అలేఖ్య కట్కం,** జర్నలిస్టు



# అంతా తమాషాగా ఉంది!

నిటారుగా
నిలబడలేనోడు
పోరుగడ్డపై సవాళ్లు విసురుతున్నాడు!

మన మట్టి మహిమ
ఏమాత్రం తెలియనోడు
కుర్చీపై ఊరేగుతున్నాడు!

ఒకే గొడుగు కింద ఉండే
ఒకడు ఆవేశంతో ఊగిపోతే
మరొకడు మౌనాన్ని మోస్తున్నాడు!

అటు ఇటుగానోడు
వాడిని వీడిని వదిలేసి
ఊకున్నోని వైపు ఉరిమురిమి చూస్తున్నాడు

త్యాగాల తడి ఎరగనోడు
అమరవీరుల స్తూపం తాకి
అప్పుడప్పుడు మలినం చేస్తున్నాడు!

అమ్మ అవతారమెత్తిన ఓ అక్క
ఎటూ పాలుపోనితనంతో
ఇంటి గుట్టు రట్టు చేస్తున్నది!

హైదరాబాదులో నిత్యం ఓ తమాషా
శాసనసభ సెక్రటేరియట్ దానికి
సాక్ష్యంగా నిలుస్తున్నాయి!

ఒకవైపు ధాన్యం వానకు తడిసిపోతుంటే
దైన్యంతో రైతు ఆరిపోతున్నాడు
తెలంగాణ ఇప్పుడు గాలిలో దీపం!

స్వప్నం భంగమైనప్పుడన్నా
మరోసారి మనం ఉలిక్కి పడకపోతే
పెను చీకటొకటి కమ్మేస్తుంది!

అంతా తమాషాగా ఉంది!
అంతా తమాషాగా ఉంది!!

**-కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
**94402 33261**




# రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811


This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.